
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 16.04.2026 | సంపుటి : 12 సంచిక : 267 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా విపక్షాల
# ఐక్యపోరు

**వ్యతిరేకంగా ఓటు వేయాలని 'ఇండియా' నిర్ణయం**
**మహిళా బిల్లుకు మద్దతిస్తాం**

- కేంద్రం ప్రతిపాదిస్తున్న పునర్విభజన ప్రక్రియ కేవలం అధికారం కోసమే
- ప్రధాని మోదీవి దేశద్రోహ చర్యలు
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే ఊరుకోం
- డీలిమిటేషన్ పేరుతో గెర్రీమాండరింగ్‌కు కుట్ర
- కులగణన లేకుండా మహిళా బిల్లు అమలులో పారదర్శకత ఉండదు
- బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే
- విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



"మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేమంతా అనుకూలం. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ప్రభుత్వం కొన్ని గిమ్మిక్కులు చేస్తోంది. పార్టీలన్నీ ఏకతాటిపై నిలిచి పార్లమెంటులో ఐక్యంగా పోరాడాలి. మేం ఈ బిల్లును వ్యతిరేకిస్తాం, కానీ మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. ఈ బిల్లులో వారు పొందుపరిచిన విధానం చూస్తే కనీసం జనాభా లెక్కల ప్రక్రియను కూడా పూర్తి చేయకుండానే డీలిమిటేషన్ అంశాన్ని చేర్చారు. రాజ్యాంగ అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుంటోంది. ప్రధానంగా వ్యవస్థలు, పార్లమెంటు చేతుల్లో ఉండాల్సిన అధికారాన్ని ఎప్పుడైనా డీలిమిటేషన్ మార్చుకునే వీలుగా వారు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో వారు ఇప్పటికే మమ్మల్ని మోసం చేశారు."
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసం లో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. మిగతా 2లో..

### నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం: స్టాలిన్
- తమిళనాడు సిఎం తీవ్ర విమర్శలు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు
- దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమమే..
- డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు: కేటీఆర్

2లో..

## రెండు రోజుల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి అవకాశం
**ముఖ్యమంత్రి రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ**

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ, పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రెన్యూవల్‌పై చర్చించారు. సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీ మార్పు, జగిత్యాల నియోజకవర్గంలో పరిణామాలపై కూడా ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రులపై, ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఈ భేటీలో చర్చించారు. సీఎం నివాసంలో ఈ భేటీ కొనసాగుతోంది.

## జనగణన తొలి దశ ఏప్రిల్ 16 నుంచి..
ఢిల్లీ,, గోవా, కర్ణాటక, మిజోరాం, ఒడిశా, సిక్కిం, అండమాన్ నికోబార్, లక్షద్వీప్‌లలో ప్రక్రియ వార్త 2లో



## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు
- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు

## డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలకు ఆందోళన అవసరం లేదు
లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు కేంద్రం వెల్లడి
అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం : నిర్మలా సీతారామన్

2లో

### జనాభా ప్రకారమే పునర్విభజన
- రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే
- సీఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు
- మోడీ మహిళలకు అతిపెద్ద కానుక
- మహిళా బిల్లుతో వారికి పెద్దపీట
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే 50శాతం పెంపు : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

## దేశంలో నక్సలిజం అంతమైంది
- మావోయిస్టు ప్రభావిత జిల్లాలు లేవు
- కేంద్రం అధికారిక ప్రకటన


**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదు- మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందింది- ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో హింస నియంత్రణలోకి వచ్చింది- కేంద్రం ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పీడించిన నక్సలిజం అంతమైందని కేంద్రం అధికారిక ప్రకటన చేసింది. దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం పంపింది. ఈ మేరకు తొమ్మిది రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం, మార్చి 31 నాటికి దేశం నక్సల్ మిగతా 2లో..

## గ్రామీణాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు
# ప్రభుత్వ లక్ష్యం



**కల్లూరులో, నారాయణపురంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి**

**ఖమ్మం ఏప్రిల్ 15(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి కల్లూరుమండలంలోపర్యటించారు. ముందుగా కల్లూరు మండలంలో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామం నారాయణపురంలో రూ 2 కోట్ల 75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సి పి సునీల్ దత్, టిజి ఎన్ పి డి సి ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వరుణ్ రెడ్డి పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు తో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ కేంద్రం కల్లూరులో10 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, మిగతా 2లో..



## హర్మూజ్‌ను చైనాతోపాటు ప్రపంచదేశాల కోసమే
# తెరిపిస్తాం

### అమెరికా రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి
రెండోదఫా చర్చల వేళ ఇరాన్ డిమాండ్

### ఇరాన్‌తో యుద్ధానికి అమెరికన్లు వ్యతిరేకం
ఏమాత్రం ప్రయోజనం లేదని వాదన
ఉద్రిక్తతలతో అమెరికాకే తీవ్ర నష్టం
ఇప్సాస్-రాయిటర్స్ సర్వేలో వెల్లడి

### అమెరికా ఆర్థిక వ్యవస్థలో వలసదారులది కీలక భూమిక
వారు దేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు
నా అత్తామామలు కూడా ఆకోవలోని వారే
ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు

వివరాలు 2 పేజీలో..

**కాల్పుల విరమణ పొడిగింపు ఉండకపోవచ్చు**
**శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం**

- హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు పూర్తిగా ఎత్తేయాలి
- యుద్ధం చాలా త్వరగానే ముగుస్తుంది
- ఆ వెంటనే ముడి చమురు ధరలు చాలా భారీగా తగ్గిపోతాయి
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు
- నాటో నుంచి అమెరికాకు ఎలాంటి మద్దతు లేదని వెల్లడి

**వాషింగ్టన్(జనంసాక్షి):** హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తామని, ఈ నిర్ణయం చైనాకు చాలా సంతోషాన్ని కలిగిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. చైనాతో సహా యావత్ ప్రపంచం కోసమే తాను ఈ నిర్ణయాన్ని తీసుకుంటున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితి మళ్లీ ఎన్నడూ ఏర్పడదని తేల్చి చెప్పారు. ఇరాన్‌కు చైనా ఆయుధాలను సప్లై చేస్తోందంటూ ఇటీవలే మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో ఇరాన్‌కు ఆయుధాలను ఇవ్వొద్దని కోరుతూ షి జిన్‌పింగ్‌కు తాను లేఖ రాశానని ట్రంప్ తెలిపారు. తన లేఖకు చైనా ప్రెసిడెంట్ రాసిన ప్రత్యుత్తరంలో ఇరాన్‌కు ఆయుధాలేం పంపించడం లేదనే స్పష్టతను ఇచ్చారన్నారు. ఇంకొన్ని వారాల్లో (మే మొదటివారంలో) తాను చైనా పర్యటనకు వెళ్లినప్పుడు జిన్‌పింగ్ సంతోషంలో తనను బలంగా, గట్టిగా కౌగిలించుకుంటారని ట్రంప్ వ్యాఖ్యానించారు. తాజాగా ఓ అమెరికన్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా ప్రెసిడెంట్ ఈ కామెంట్స్ చేశారు. తాము ఇరాన్ యుద్ధాన్ని ముగించిన వెంటనే మిగతా 2లో..

## వారసత్వ కట్టడాలను పరిరక్షిస్తాం
- పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
- కుతుబ్‌షాహి టూంబ్స్ కట్టడాలను పరిశీలించిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్(జనంసాక్షి):** కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలో మీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని, డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ మిగతా 2లో..



### భారత్-అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలకు
# సన్నాహాలు!
**ఈ మేరకు వచ్చేవారం అమెరికాకు భారత బృందం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు మళ్లీ మొదలుకానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం భారత అధికార ప్రతినిధి బృందం వచ్చేవారం అగ్రరాజ్యానికి వెళ్లనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికార వర్గాలు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా- భారత్ మధ్య ఇప్పటికే తాత్కాలిక వాణిజ్యఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. తాజా చర్చల్లో ఈ ఒప్పందంపై ఇరుదేశాలు ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయనున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నిజానికి ఈ ఒప్పందంపై మార్చిలోనే సంతకాలు చేయాలని గతంలో ఇరుదేశాలు అనుకున్నాయి. అయితే, అధ్యక్షుడు మిగతా 9లో..

## వికసిత్ కర్ణాటక కోసం పాటుపడండి
**అందుకోసం 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ**



**బెంగుళూరు(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు."మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు మిగతా 9లో..

## బంగ్లాలో ఘోరం
**పౌరుల పడవ మునక.. 250 మంది గల్లంతు**

వార్త 9 లో

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు
ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లతో విస్ఫోటనం
ప్రమాదంలో ఐదుగురు మృతి.. 20 మందికి గాయాలు



## బీహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణం

**పాట్నా(జనంసాక్షి):** భాజపా సీనియర్ నేత సమ్రాట్ చౌధరీ బిహార్ 21వ ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో భాజపాకు చెందిన కీలక నాయకులు, కూటమి భాగస్వాములు పాల్గొన్నారు. బిహార్‌లో భాజపా నుంచి సీఎం పదవి చేపట్టిన తొలి నాయకుడిగా సమ్రాట్ చౌధరీ రికార్డు సృష్టించారు. రాజ్యసభకు ఎన్నికైన జేడీ(యూ) అధినేత మిగతా 2లో..

## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి.

## డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలకు ఆందోళన అవసరం లేదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రవర్గాలు తెలిపాయి. లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదని కేంద్రవర్గాలు పేర్కొన్నాయి. 2011 జనాభా లెక్కలు ఇక్కడ నిర్ణయాత్మక అంశం కావని తెలిపాయి. అంటే దామాషా పరంగా చూస్తే ఎటువంటి మార్పు ఉండదని, ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనన్న దక్షిణాది ఆందోళనలను ఈ విధానం నివారిస్తుందని వివరించాయి. దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టమూ వాటిల్లదని, ప్రతీ రాష్ట్రానికి కేటాయించిన సీట్ల సంఖ్య కూడా 50 శాతం పెరుగుతుందని స్పష్టం చేశాయి.

## గ్రామీణాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు ప్రభుత్వ లక్ష్యం

వైద్య సేవలు, మౌళిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, తదితర మండలాల పరిసర పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని స్పష్టం చేశారు.33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రంద్వారా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరామెరుగుపడుతుందని వెల్లడించారు . గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో కల్లూరు లోనీ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, మండలాల పరిసర పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని తెలిపారు.33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు,చేనేత కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్,ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ టీజి ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,సి పి సునీల్ దత్, కల్లూరుసబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, హెల్త్ ఎస్ ఈ శ్రీధర్,డిఎం అండ్ హెచ్ఓ రామారావు,డి సి హెచ్ ఓరాజశేఖర్ గౌడ్ కల్లూరు హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ రమేష్ , సత్తుపల్లి డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రవీణ్,కల్లూరు ఏఎంసిచైర్మన్ భాగం నీరజ చౌదరి, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహాన బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కల్లూరు వైస్ చైర్మన్ కోటేశ్వరి, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, భూ దాటి నారపరెడ్డి, పొట్రు అర్జున్ రావు, బొల్లం రామారావు, అంకిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, యాస శ్రీకాంత్ , శీలం కృష్ణారెడ్డి, పసుమర్తి మోహన్రావు, కీసర మోహన్ రెడ్డి, బొల్లం శంకర్, నోటి కృష్ణారెడ్డి, జంగా పిచ్చి రెడ్డి, మాజీ సర్పంచ్ శీలం కృష్ణారెడ్డి,బొర్రా కోటేశ్వరరావు గౌడ్, గంగాదేవి పాడు సర్పంచ్ మాలోత్ రాధాకృష్ణ, ప్రజా ప్రతినిధులు మున్సిపాలిటీ కౌన్సిలర్లు భూక్యరాంబాయి, దాసరి సుధారాణి, ఉబ్బన రాంబాబు, యాస నాగమణి, ఖమ్మం పాటి రాధా, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, బిఆర్ఎస్ కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, ఎండి ఇస్మాయిల్, కనపర్తి శ్యామల వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ కట్టడాలను పరిరక్షిస్తాం

కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన మంత్రి జూపల్లి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా విపక్షాల ఐక్యపోరు





రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమే

మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు.కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్లను 2023లోనే అమలు చేయమని కోరాం. మా విజ్ఞప్తిని ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఓటమి నిర్ధారణ కావడంతో, అర్ధాంతరంగా ఈ బిల్లును ప్రవేశపెట్టాలని అధికార బీజేపీ భావిస్తోంది. డీ లిమిటేషన్ ద్వారా నార్త్, ఈస్ట్, సౌత్, చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది. లోక్‌సభ 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలి. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తాము' అని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు మేము వ్యతిరేకం కాదు. ప్రభుత్వం తెచ్చిన విధానమే తప్పు. రాజకీయ లబ్ది కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెరపైకి తెచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అస్సాం, జమ్మూ కాశ్మీర్‌లో జరిగినట్లే నియోజకవర్గాల విభజనలో అవకతవకలకు కేంద్రం యత్నిస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలులో జాప్యం చేయడానికే కేంద్రం సాకులు వెతుకుతోంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా విపక్షాలన్నీ ఐక్యంగా పోరాడతాయి' అని అన్నారు

### నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం

చెన్నై(జనంసాక్షి): దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ది చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి. ఈ పోరు కేవలం సీట్ల కోసం మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఉనికి, గౌరవం కోసమని విపక్ష పార్టీలు చెబుతున్నాయి.

### దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమమే..: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు.

### జనాభా ప్రకారమే పునర్విభజన..

వరంగల్(జనంసాక్షి):నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాగా జనాభా ప్రకారమైతే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం పెంపు విధానం తెచ్చారని తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందన్నారు."1972లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల ఏపీకి ఒక లోక్‌సభ సీటు తగ్గింది. ప్రస్తుత సీట్ల ప్రకారమైతే మహిళలకు 170 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే 270కిపైగా సీట్లు వస్తాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా హైబ్రిడ్ పాలసీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు"అని విమర్శించారు.

## జనగణన తొలి దశ ఏప్రిల్ 16 నుంచి

న్యూఢిల్లీ(జనంసాక్షి):జనగణనలో భాగంగా ఢిల్లీ, గోవా, కర్ణాటక, మిజోరాం, ఒడిశా, సిక్కిం, అండమాన్ నికోబార్, లక్షద్వీప్‌లలో ఏప్రిల్ 16 నుంచి క్షేత్రస్థాయిలో గృహ గణనను ప్రారంభించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇప్పటికే సెల్ఫ్ ఎన్యూమరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎన్యూమరేటర్లు మే 15 వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రతి ఇంటికి వెళ్లి డేటా సేకరించనున్నారు. స్వయంగా నమోదు చేసుకున్న వారి వివరాలను నిర్ధరించనున్నారు. తొలిసారి తీసుకొచ్చిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంలో.. సుమారు 12 లక్షల గృహాలు అధికారిక పోర్టల్ ద్వారా నమోదైనట్లు కేంద్రం తెలిపింది.ఈ నెల 16 నుంచి ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈనెల 30 వరకు ఈ ఆరు రాష్ట్రాల్లో పోర్టల్ అందుబాటులో ఉండనుంది. మే 1 నుంచి మే 30 వరకు హౌస్ లిస్టింగ్ నిర్వహించనున్నారు. బిహార్‌లో ఈ ప్రక్రియ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభమై మే 1 వరకు కొనసాగుతుంది.

## దేశంలో నక్సలిజం అంతమైంది

నుంచి విముక్తి పొందిందని పేర్కొంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల్లో కూడా ఇప్పుడు హింస నియంత్రణలోకి వచ్చిందని కేంద్రం తెలిపింది.నక్సలిజం పూర్తిగా అంతమైనా, తిరిగి అది పుట్టకుండా ఉండేందుకు కేంద్రం జిల్లాలను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలతో పాటు మొత్తం 37 లెగసీ అండ్ థ్రస్ట్ జిల్లాలుగా ప్రకటించింది. అక్కడ నక్సలిజం అంతమైనప్పటికీ భద్రతను పటిష్ఠం చేయడానికి అభివృద్ధిని కొనసాగించడానికి ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగించనున్నారు. ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా ఒక్కదాన్ని మాత్రమే డిస్ట్రిక్ట్ ఆఫ్ కన్సర్న్ కేటగిరీలో ఉంచారు. ఇక్కడ నక్సల్స్ వ్యవస్థ చిన్నాభిన్నమైనా, సమీప భవిష్యత్తులో నిరంతర భద్రత అవసరమని పేర్కొన్నారు.అధికారిక గణాంకాల ప్రకారం, నక్సల్ హింసలో ఇప్పటివరకు 17 వేలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ నేపథ్యంలో నక్సలిజం నిర్మూలనను ఒక పెద్ద విజయంగా కేంద్రం అభివర్ణిస్తోంది. మరోవైపు, దశాబ్దాలుగా వేళ్లూనుకున్న నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్?సభలో పేర్కొన్నారు. సాయుధ తీవ్రవాద ఉద్యమానికి మూలమైన మావోయిస్టు కేంద్ర కమిటీ నిర్మాణాన్ని దాదాపు విచ్ఛిన్నం చేశామన్నారు. 'వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం విముక్తికి చర్యలు' అనే అంశంపై ఆయన లోక్‌సభలో షా ప్రసంగించారు.

### బిహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణం

నీతీశ్‌కుమార్ మంగళవారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమ్రాట్‌కు ఆ పదవి కట్టబెట్టేందుకు భాజపా మొగ్గు చూపింది. ఈ క్రమంలోనే తాజాగా సమ్రాట్ బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్‌కుమార్ చౌధరీలు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు.

## హర్మ్యూజ్‌ను చైనాతోపాటు ప్రపంచదేశాల కోసమే తెరిపిస్తాం

ముడి చమురు ధరలు చాలా భారీగా తగ్గిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. నవంబరులో అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికలు జరిగే నాటికి ఇంధన ధరలు దాదాపుగా ఇప్పటి స్థాయిలోనే, లేదంటే కొంత ఎక్కువ స్థాయిలో ఉంటాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం గ్యాలన్‌కు సగటున 4 డాలర్లకు కొంచెం ఎక్కువగా ఉన్న గ్యాస్ ధరలు, ఎన్నికల నాటికి చాలా తగ్గుతాయని ట్రంప్ అంచనా వేశారు. ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 92 డాలర్లు ఉండటం పట్ల తాను సంతోషంగా ఉన్నానని, ఈ వార్ ముగియగానే ధరలు భారీగా పడిపోతాయని ఆయన చెప్పారు.పశ్చిమాసియా యుద్ధం చాలా త్వరగా ముగుస్తుందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇంధన ధరలపై ఏప్రిల్ 12న(ఆదివారం) తాను చేసిన వ్యాఖ్యలను మీడియాలో వక్రీకరించి చూపించారని అమెరికా ప్రెసిడెంట్ తెలిపారు. నవంబరు నాటికి ఇంధన ధరలు భారీ స్థాయిలోనే ఉంటాయని, రేట్లు ఇంకాస్త పెరిగే సూచనలూ ఉన్నాయని ట్రంప్ చెప్పారంటూ ఓ మీడియా సంస్థ ఆదివారం రోజు కథనాన్ని ప్రచురించింది. ఈ వ్యాఖ్యల ద్వారా ఇరాన్‌పై అమెరికా యుద్ధం వల్ల అమెరికన్లకు నష్టమే జరుగుతోందని ట్రంప్ ఒప్పుకుంటున్నారని విపక్ష నేతలు విమర్శలు గుప్పించారు. ఈనేపథ్యంలో తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచురించారని ట్రంప్ క్లారిటీని ఇవ్వడం గమనార్హం.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

### నాటో నుంచి ఎలాంటి మద్దతు లేదు: ట్రంప్

ఇరాన్‌తో యుద్ధానికి, హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరిపించే విషయంలో తమకు నాటో కూటమి నుంచి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుకుపడిన ఆయన.. తాజాగా మరోసారి దాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలవలేదంటూ ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ ఈ కూటమి అండగా లేదని ట్రంప్ ఆరోపించారు. భవిష్యత్తులోనూ దానినుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని మండిపడ్డారు. ఇక, గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా ఈ కూటమిని ఓ కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచలన ప్రకటన చేశారు.ఇదిలాఉండగా.. అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో-14 (ఖనీజూవ ఒవనీ), అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొందని ట్రంప్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆ దేశం వద్ద అణ్వాయుధం ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించిన సంగతి తెలిసిందే.

## రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికాతో రెండో సారి శాంతి చర్చలు ప్రారంభం కానున్న వేళ ఇరాన్ కీలక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధంలో తమ దేశానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంటూ, దాదాపు 270 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 లక్షల కోట్లు పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. తమకు జరిగిన నష్టాలను భర్తీ చేసేందుకు ఇతర దేశాలు సహాయపడాలని ఇరాన్ కోరుకుంటోంది. యుద్ధం కారణంగా దేశంలోని మౌలిక సదుపాయాలు, గృహాలు, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని దేశం ఒంటరిగా భరించడం సాధ్యం కాదని, అంతర్జాతీయ స్థాయిలో పరిహారం అవసరమని ఇరాన్ పేర్కొంది. గృహ నిర్మాణాలు, మౌలిక వసతులు ధ్వంసం అవడమే కాకుండా, చమురు, వాణిజ్య రంగాల్లో మూసివేత వల్ల నష్టాలు భారీగా ఉన్నాయని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నష్టాల అంచనా ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. తమ నష్టాలను భర్తీ చేసుకునేందుకు హోర్ముజ్ జలసంధి ద్వారా వెళ్లే నౌకలపై పన్ను విధించడం వంటి చర్యలను కూడా ఇరాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, యుద్ధ సమయంలో ఐదు అరబ్ దేశాలు తమ భూ భాగాన్ని ఉపయోగించేందుకు అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు అనుమతి ఇచ్చాయని, ఆ దేశాలు కూడా తమకు పరిహారం చెల్లించాలని ఇరాన్ ఇప్పటికే కోరింది.

## అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక

న్యూయార్క్: అమెరికా ఆర్థికవ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టంచేశారు. హెచ్-1బీ వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు. నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ చదువుకొని, ఈ దేశ పౌరుడిగా మారిన మా మామగారు.. అమెరికా ప్రయోజనాల కోసమే పాటుపడ్డారని వ్యాఖ్యానించారు. భారత మూలాలున్న తన అత్తింటి కుటుంబంపై జేడీవాన్స్ ప్రశంసలు కురిపించారు. అమెరికాను సుసంపన్నం చేయడంలో, ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంలో వారు ఒక నిదర్శనంగా నిలిచారన్నారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో నివసిస్తున్నవారు గ్రీన్‌కార్డ్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోందంటూ భారత సంతతి వ్యక్తి ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ఉషా చిలుకూరి అమెరికాలో కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. ఇరాన్‌తో చర్చల అంశంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న అపనమ్మకం రాత్రికి రాత్రి పోయేది కాదని అన్నారు. ఇరాన్ ప్రతినిధులు ఒప్పందం కుదరాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే ఈ సంప్రదింపులు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఆలోపే చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుపక్షాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

## ఇరాన్‌తో యుద్ధానికి అమెరికన్లు వ్యతిరేకం

పశ్చిమాసియాలో జరుగుతోన్న యుద్ధం వల్ల అమెరికా సైన్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో ఇరాన్‌పైదాడులను సొంత పౌరులు కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధం వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదంటూ 54శాతం మంది అమెరికన్లు భావిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఇప్సాస్-రాయిటర్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. గత కొన్ని వారాలుగా ఇరాన్‌పై యుద్ధం సాగిస్తోన్న అమెరికా.. తాజాగా హర్మ్యూజ్ జలసంధిని దిగ్బంధించింది. అయితే, ఈ చర్యలను 54శాతం మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నట్లు సర్వేలో తేలింది. ఈ దాడులతో వారి ఆర్థికవ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వారు అభిప్రాయం వ్యక్తంచేశారు.

# గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్




**కాసిపేట ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కాసిపేట పోలీసులు తెలిపారు. కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ లోని గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన మడావి అర్జు తన ఇంటి ఆవరణలో ఎవరికీ కనిపించకుండా చీరలు కట్టి, చిక్కుడు పోదల చాటున గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న సమాచారం అందుకున్న ఎస్సై ఆంజనేయులు, రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నిందితుడి నివాసంపై దాడి చేశారు. నిందితుడి ఇంటి ఆవరణలో సుమారు 8 అడుగుల ఎత్తు పెరిగిన 5 గంజాయి మొక్కలను కాసిపేట పోలీసులు గుర్తించారు. పంచనామా నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ. 50,000/- ఉంటుందని అంచనా. కావున కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని మందమర్రి సీఐ అరెస్టు చేయడం జరిగింది. దర్యాప్తును మందమర్రి సీఐ విచారించారు . సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ సందర్శించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను సాగు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా లేదా సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని . ఎవరైనా ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని తీవ్రంగా హెచ్చరించారు. యువత మత్తు బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా గంజాయి సాగు చేసినా లేదా విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించగలరు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు

# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

- పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి
- కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి



**హైదరాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాప రాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హోస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపం లోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. తెలంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ

- జిల్లా కలెక్టర్‌కు అధికారుల అభినందన



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్15 (జనంసాక్షి) :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో, పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం అందించినందుకు కలెక్టర్‌కు అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమిష్టి కృషి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఫలితాలు అందరి కృషి ఫలితమని, రానున్న రోజుల్లో మరింత కష్టపడి జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో నిలపాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లును సాధిస్తాం

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 15 (జనం సాక్షి ):** మహిళా బిల్లును పార్లమెంట్ లొ జరిగే సభలో అమోదం చేస్తామని మెదక్ ఎంపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఇతర పార్టీ లు ఎన్ని కుట్రలు చేసిన మహిళా బిల్లు సాధిస్తామని తెలిపారు. బుధవారం రోజున మెదక్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ మోడీ మహిళల కష్టాలు తెలుసుకున్నారని, తల్లి శక్తి చాలా గొప్పంది రేఖ గుప్తా ముఖ్యమంత్రి అయ్యింది అంటే బీజేపీతోనే సాధ్యమైందని, స్త్రీలు అనుకంటే అన్ని సాధ్యమవు తున్నాయని, కాంగ్రెస్ నాయకులు బాత్ రూమ్ కట్టాలని సోయిలేదని, మహిళలు ఎంపీ ఎమ్మెల్యే కావాలని ప్రధాని పట్టుదల పేద ఇళ్లలో వంట గ్యాస్ ఇచ్చిన ఘనత ప్రధానిదిఆడపిల్ల లక్ష్మి దేవత కావాలాని పెళ్లిడో సుకన్య సమృద్ధి పథకం ఇచ్చారని, నిర్మల్ సీతారామన్ ఆర్థిక మంత్రి ఆర్థిక వ్యవస్థను నిలబెట్టారని, కేంద్రం మహిళలకు మంత్రి పదవులిచ్చిందని, అంగన్వాడీ స్కూల్స్ 13 లక్షల సొంత భవనాలిచ్చారని ఇచ్చారు. పోషణ అభియాన్2 కార్యక్రమంలో భాగంగా పిల్లలుకు పాత తరం ఆహారం అందిస్తున్నారన్నారని, భారతదేశం సంస్కృతి సంప్రదాయాలు పుట్టిన ఇళ్ళుమహిళలకు చట్టాలు రావాలి 10 సంవత్సరలు పాలించిన ముఖ్యమంత్రి ఫోమ్ హౌస్‌కే పరిమితమయ్యాడని, మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ సాధ్యం అవుతుందని అన్నారు.

# జగిత్యాల జన గర్జన విజయవంతం చేయండి

- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ (సౌత్ ఆఫ్రికా) గుర్రాల నాగరాజు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ నెల 20వ తేదీన జగిత్యాల గడ్డపై జరగబోయే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ "జగిత్యాల జన గర్జన"ను ఘనవిజయంగా మార్చాలని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ (సౌత్ ఆఫ్రికా) నాగరాజు గుర్రాల కోరారు. తెలంగాణ గర్వకారణమైన నాయకుడు కేసీఆర్ సమక్షంలో ఈ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా జరగనుందని, ఈ సభలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తమ అనుచరులు, వేలాది మంది కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరడం ఒక కీలక ఘట్టమని, ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త దిశను చూపే పరిణామమని, ఇటీవల కేటీఆర్ జగిత్యాలకు వచ్చి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన విషయం అందరికీ తెలిసిందేనని, కేసీఆర్ ఆశయాలకు, రామన్న ఆలోచనలకు న్యాయం జరగాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని, అప్పుడు మాత్రమే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి" అనే నినాదంతో జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్రకు శ్రీకారం చుడుదామని పిలుపునిచ్చారు.

# హనుమాన్ మాల ధరించిన విద్యార్థికి అవమానం

- హెడ్మాస్టర్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్15 (జనంసాక్షి) :** హనుమాన్ మాలలో వచ్చిన విద్యార్థిని పాఠశాలలోకి అనుమతించకపోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీంతో హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల హెడ్ మాస్టర్ ఆ విద్యార్థిని గేటు వద్దే అడ్డుకున్నారు. మాల ధరించి తరగతి గదిలోకి రాకూడదని చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. హెడ్ మాస్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి తల్లిదం డ్రులు, బజరంగదళ్ కార్యకర్తలు.. పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో నినాదాలు చేస్తూ భైఠాయిం చారు. హిందూ ఆచారాలను అవమానించిన హెడ్ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జర్మనీ దేశంలో భారీగా ఉద్యోగావకాశాలు

- నాలుగు నెలల్లోనే జర్మన్ భాష శిక్షణ అందిస్తాం
- ఏటీసీల ద్వారా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- తెలంగాణ యువత సద్వినియోగం చేసుకోవాలి
- కార్మిక శాఖ మంత్రి వివేక్



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు జర్మనీ దేశంలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నాలుగు నెలల వ్యవధిలో ప్రభుత్వం జర్మనీ భాష నేర్పించి యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కార్మిక శాఖ భూగర్భ గనుల శాఖ మాత్యులు గడ్డం వివేక్ పేర్కొన్నారు. బుధవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టాంకామ్ అనే సంస్థ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జర్మనీ వంటి దేశాల్లో భారీగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని, తెలంగాణ యువత ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకో వాలని పిలుపుని చ్చారు. జర్మనీలో ప్రతి సంవత్సరం సుమారు 5 లక్షల ఉద్యోగాల అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ప్రతి ఏడాది 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆ దేశం ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఏటీసీల ద్వారా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ:- 4,000 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. టాంకామ్ ద్వారా నాలుగు నెలల్లోనే జర్మన్ భాష శిక్షణ అందిస్తామని, ప్రైవేటు ఏజెన్సీల మోసాలకు గురికాకుండా యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విదేశాల్లో భారతీయులకు మంచి పేరు ఉందని, అక్కడి చట్టాలను గౌరవిస్తూ కష్టపడి పనిచేస్తారని గుర్తుచేశారు. నెలకు 2 లక్షలకు పైగా వేతనాలు పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెందుతుందని తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువత టాంకామ్ అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణ గిగ్ వర్కర్స్ యాక్ట్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు . ఈ జర్మనీ ప్రాజెక్టుకు సంబంధించి పలువురు యువకులు ప్రైవేట్ ఏజెన్సీలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం అందిస్తున్న సేవలను అందిపుచ్చుకొని ఎలాంటి డబ్బులు ఖర్చు చేయకుండా నెలకు రెండు లక్షల రూపాయల వేతనంతో కూడిన జీతాన్ని తీసుకొని తమ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు.

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

- ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత



**వికారాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచే సుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం
- రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం
- లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు
- మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ. 568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ. 128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.



# నిజామాబాద్ మార్కెట్లో పసుపు రైతుల దాడి

- ధరలు తగ్గించి కొనడంపై ఆందోళన

**నిజామాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** నిజామాబాద్ మార్కెట్ యార్డుపై పసుపు రైతులు దాడికి దిగారు. బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తూ పసుపు ధర తగ్గిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో ఒక ధర ఉంటే.. ఆఫ్ లైన్ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు.. ఆఫీస్ పై దాడి చేశారు. మార్కెట్ అధికారులను ఘెరావ్ చేశారు. కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. మార్కెట్ లో బహిరంగవేలం ద్వారా జరుగుతున్న కొనుగోళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ మార్కెట్ యార్డుకు భారీగా పసుపు అమ్మకానికి వచ్చింది. దాదాపు 50 వేల బస్తాల పసుపును రైతులు మార్కెట్ కు తీసుకొచ్చారు. ఆన్ లైన్ లో క్వింటాల్ పసుపు ధర రూ 16వేలు ఉండగా.. బహిరంగ వేలం ద్వారా క్వింటాల్ పసుపును మూడు వేలు తగ్గించి రూ. 13వేలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆఫ్ లైన్ కొనుగోళ్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

# పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు

- మీడియా ముందు మంగ్లీ ఆవేదన



**హైదరాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియాతో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజులుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు. సుభాక్షేత్ర బిజినెస్ అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి.. దానికి ఎండీగా ఉన్నది మధు. ప్రస్తుతం బాధితుడిగా మీడియాతో మాట్లాడుతున్న హిమాకాంత్ రెడ్డి ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఈ స్కామ్‌కి మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు' అని అన్నారు.

# భారతదేశం ఒక అప్రకటిత రాజ్యాంగ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

భారతదేశం నేడు ఒక అప్రకటిత రాజ్యాంగ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు', 'నియోజకవర్గాల పునర్విభజన' వంటి నినాదాల వెనుక రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే కుట్రలు దాగి ఉన్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్న తరుణంలో, ఈ పోరాటాన్ని కేవలం పార్లమెంటరీ స్థాయిలోనే కాకుండా, ఒక శక్తివంతమైన ప్రజా ఉద్యమంగా (Mass Movement) మార్చాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది.




**1. 2026 పొలిటికల్ సినారియో:**

**పునర్విభజన – ఒక రాజకీయ భూకంపం**

2026లో నియోజకవర్గాల పునర్విభజన గడువు ముగియనుంది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయి. ఇది కేవలం సీట్ల సంఖ్య తగ్గడం కాదు, ఢిల్లీ దర్బార్‌లో దక్షిణాది గొంతుక మూగబోవడం. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి 'ద్రావిడ కాన్సెప్ట్' మరియు 'ఫెడరల్ స్పిరిట్' అనేవి ఇప్పుడు అత్యంత ప్రజాదరణ పొందిన (గ్రాశీజూబశ్రీఖితీ ణవఖఱఅం) నినాదాలుగా మారాయి. ఇవి ప్రజల గుండెల్లోంచి వచ్చిన డిమాండ్లు కాబట్టి, వీటి చుట్టూ జనం కదిలే అవకాశం పుష్కలంగా ఉంది.

**2. ప్రజాస్వామిక ఉద్యమంలోకి మావోయిస్టు లీగల్ శ్రేణుల ప్రవేశం**

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యమానికి క్షేత్రస్థాయి అనుభవం, గట్టి సైద్ధాంతిక పునాది అవసరం. ఇటీవల లీగల్ ఫ్రేమ్‌లోకి వచ్చిన మావోయిస్టు పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు, మిలిటరీ చీఫ్ దేవుజీ (తిరుపతి), మల్లా రాజిరెడ్డి, పుల్లూరు ప్రసాద్ రావు (చంద్రన్న), సుజాతక్క వంటి నేతల ప్రవేశం ఈ ఉద్యమానికి ఒక కొత్త దిశను ఇవ్వగలదు. దశాబ్దాల కాలం పాటు ప్రజా సమస్యలపై అడవిలో పోరాడిన వీరి అనుభవం, ఇప్పుడు ప్రజాస్వామ్య పద్ధతుల్లో 'లీగల్ మాస్ మూవ్‌మెంట్'ను నిర్మించడానికి ఒక వెన్నెముకగా మారుతుంది.

వీరి సారథ్యంలో నడిచే శ్రేణులు ఫెడరల్, సెక్యులర్ మరియు చిన్న రాష్ట్రాల హక్కుల సాధన కోసం పని చేస్తే, ఉద్యమం కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా పల్లెపల్లెకూ చేరుతుంది. అణగారిన వర్గాలను, రైతు కూలీలను ఈ 'సౌత్ మూవ్‌మెంట్'లో భాగస్వాములను చేయడం ద్వారా దీనిని ఒక తిరుగులేని ప్రజాస్వామిక విప్లవంగా మలచవచ్చు.

**3. ఐక్య సంఘటన** (United Front):

**లెఫ్ట్ మరియు డెమోక్రాటిక్ శక్తుల కలయిక**

భారతదేశం ఎదుర్కొంటున్న ఫాసిస్టు ధోరణులను ఎదిరించాలంటే విడివిడిగా చేసే పోరాటాలు సరిపోవు. ఇక్కడ ఒక 'బ్రోడ్ బేస్డ్ యునైటెడ్ ఫ్రంట్' అవసరం.

**లెఫ్ట్ శక్తులు:** వర్గ పోరాట అనుభవం ఉన్న వామపక్షాలు సామాజిక న్యాయం మరియు ఆర్థిక సమానత్వం కోసం గళమెత్తాలి.

**డెమొక్రాటిక్ శక్తులు :** పౌర హక్కుల సంఘాలు, జర్నలిస్టులు, మేధావులు రాజ్యాంగబద్ధమైన హక్కుల రక్షణ కోసం ప్రజలను చైతన్యపరచాలి.

ప్రజాసంఘాలు: క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించడంలో (Mass Mobilization) కీలక పాత్ర పోషించాలి.

ఈ శక్తులన్నీ కలిసి 'ఇండియా కూటమి' (INDIA Alliance) ముందు ఒక నిర్దిష్టమైన ఎజెండాను ఉంచాలి. రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాకుండా, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసేలా ఈ ఐక్య సంఘటన ఒత్తిడి తీసుకురావాలి.

**4. దక్షిణాది అస్తిత్వం – ఫెడరల్ నినాదం**

దక్షిణాది రాష్ట్రాలు దేశానికి సంపదను సృష్టిస్తున్నప్పటికీ, కేంద్రం నుండి వస్తున్న నిధుల పంపిణీలో తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నాయి. 'ట్యాక్స్ డివిజన్'లో జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంటి నేతలు ఇప్పటికే గళం విప్పుతున్నారు. దీనికి దేవుజీ వంటి ప్రజా నేతల క్షేత్రస్థాయి మద్దతు తోడైతే, ఇది ఒక బలమైన 'సౌత్ నినాదం'గా మారుతుంది. ఢిల్లీ పెత్తనానికి వ్యతిరేకంగా సాగే ఈ పోరాటం చిన్న రాష్ట్రాల హక్కులను, ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడే రక్షణ కవచంలా పనిచేస్తుంది.

**5. ఇండియా కూటమి ముందున్న కర్తవ్యాలు**

2026 పొలిటికల్ సినారియోలో ఇండియా కూటమి కేవలం ఒక రాజకీయ కూటమిగా మిగిలిపోకూడదు. అది ఒక ప్రజా ఉద్యమ వేదికగా మారాలి.

నియోజకవర్గాల పునర్విభజనపై స్పష్టమైన పోరాటం: జనాభా ప్రాతిపదికన కాకుండా, రాష్ట్రాల సమానత్వం ప్రాతిపదికన సీట్ల పంపిణీ ఉండాలని డిమాండ్ చేయాలి.

కుల గణన: సామాజిక న్యాయం కోసం కుల గణనను తక్షణమే చేపట్టాలని క్షేత్రస్థాయిలో ఉద్యమించాలి.

**చిన్న రాష్ట్రాల రక్షణ :** బలమైన రాష్ట్రాలే బలమైన దేశానికి పునాది అనే సూత్రాన్ని ప్రచారం చేయాలి.

**6. ప్రజాస్వామిక ఉద్యమ రూపం – విశ్లేషణ**

మావోయిస్టు లీగల్ శ్రేణులు ఈ ఉద్యమంలో భాగస్వామ్యం అవ్వడం అంటే, అది మళ్ళీ సాయుధ పోరాటం వైపు వెళ్లడం కాదు. అది పూర్తిస్థాయి 'ప్రజాస్వామిక ఉద్యమ' రూపం తీసుకోవాలి. ప్రజా క్షేత్రంలో చర్చలు, సదస్సులు, ధర్నాలు, మరియు శాంతియుత నిరసనల ద్వారా వ్యవస్థను ప్రశ్నించాలి. దేవుజీ, చంద్రన్న వంటి నేతలు తమకున్న వ్యూహాత్మక నైపుణ్యాన్ని (Strategic Skills) ప్రజా సముదాయాలను ఏకం చేయడానికి ఉపయోగించాలి.

పారిశ్రామికవేత్తలు, బ్యూరోక్రాట్లు, మేధావులతో రేవంత్ రెడ్డి వంటి నేతలు జరుపుతున్న సమన్వయం ఒకవైపు.. క్షేత్రస్థాయిలో లీగల్ ప్రజా శ్రేణుల కదలిక మరోవైపు.. ఈ రెండూ కలిస్తేనే 'దక్షిణాది ఉద్యమం' ఒక అజేయమైన శక్తిగా మారుతుంది.

చరిత్ర సృష్టించే సమయం


2026లో మనం చూస్తున్న రాజకీయ పరిణామాలు భారతదేశ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. ఫెడరల్ వ్యవస్థను, సెక్యులరిజాన్ని కాపాడుకోవడం అనేది ఇప్పుడు ప్రతి ఒక్కరి బాధ్యత. లెఫ్ట్ శక్తులు, మావోయిస్టు లీగల్ శ్రేణులు, మరియు ప్రజాస్వామ్యవాదులు అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఈ 'ఐక్య సంఘటన'ను నిర్మించాలి.

ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంటి యువ నేతలకు ఇది ఒక గొప్ప అవకాశం. ఆయన తనకున్న రాజకీయ అధికారంతో, దేవుజీ వంటి నేతల ప్రజా బలంతో కలిసి సాగితే, దక్షిణాది ఆత్మగౌరవ పోరాటం దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖిస్తుంది. ఢిల్లీ పెత్తనాన్ని గద్దె దించి, రాష్ట్రాల హక్కులను సాధించుకునే వరకు ఈ 'ప్రజాస్వామిక విప్లవం' ఆగకూడదు.

సమాఖ్య వ్యవస్థ వర్ధిల్లాలి – దక్షిణాది ఆత్మగౌరవం వెల్లివిరియాలి!

**బండి దుర్గాప్రసాద్ సామాజిక విశ్లేషకులు**

# అక్షరానికి వచ్చిన గౌరవం



మౌనంలో నెట్టివేయబడిన జీవితాలకు భాషనిచ్చిన రచయిత స్కైబాబకు లభిస్తున్న "స్వాతంత్ర్య సమరయోధుడు బాబూమియా బ్యాండ్ వాలే జాతీయ సమైక్యత అవార్డు" ఒక వ్యక్తిగత సత్కారం మాత్రమే కాదు. అది మరుగున పడిన అనుభవాలను సాహిత్య మధ్యలో నిలబెట్టిన అక్షరానికి వచ్చిన గౌరవం. సాహిత్యంలో కొన్ని సందర్భాలు కేవలం వ్యక్తిగత విజయాలుగా మాత్రమే నిలవవు. అవి ఒక సమాజపు మౌనానికి, కనిపించనట్టు చేయబడిన జీవితాలకు, వినిపించనట్టు చేయబడిన అనుభవాలకు, గౌరవం దక్కని మనుష్య గాథలకు వచ్చిన గుర్తింపులుగా నిలుస్తాయి. స్కైబాబకు లభిస్తున్న ఈ గౌరవం అలాంటి అరుదైన సందర్భం. ఇది ఒక రచయితకు వచ్చిన సత్కారం మాత్రమే కాదు; తెలుగు సాహిత్యంలో మరుగున పడిన అనుభవాలను మధ్యలో నిలబెట్టిన అక్షరానికి వచ్చిన గుర్తింపు.

స్కైబాబ పేరు తెలుగుసాహిత్యంలో ఒక రచయిత పేరుకంటే ఎక్కువ; అది ఒక స్వరం, ఒక సాక్ష్యం, ఒక నైతిక బాధ్యత. కవి, కథకుడు, నవలాకారుడు, పాత్రికేయుడు, సామాజిక కార్యకర్తగా ఆయన తన ప్రత్యేక ఉనికిని నిర్మించుకున్నారు. ముఖ్యంగా ముస్లిం జీవితంలోని అంతర్గత, బాహ్య పార్శ్వాలను తెలుగుసాహిత్యంలో ప్రతిష్ఠించడంలో ఆయన చేసిన కృషి విశేషమైనది. చాలా కాలంగా "మన మధ్యలో ఉన్నప్పటికీ సాహిత్యంలో పరాయివాడిగా" నిలబెట్టబడిన ఒక జీవితాన్ని ఆయన తన అక్షరంతో లోపలికి తీసుకువచ్చారు.

తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవితం తరచుగా రెండు వైపుల మధ్య బంధించబడింది. ఒకవైపు అలంకారాత్మక రొమాంటిసిజం, మరోవైపు అనుమానం, అపోహ, భయం. ఈ రెండూ ఒకే రకమైన దూరాన్ని సూచిస్తాయి. దగ్గరగా చూడలేకపోవడం, వినలేకపోవడం, అర్థం చేసుకోలేకపోవడం. స్కైబాబ రచన ఈ దూరాన్ని చెరిపేసింది. ఆయన ముస్లిం జీవితాన్ని ఒక "విషయం"గా కాదు, ఒక అంతరంగ అనుభవ ప్రపంచంగా మన ముందుంచారు. అక్కడ గాయాలున్నాయి, మౌనాలున్నాయి, అవమానాలున్నాయి; కానీ ప్రేమ ఉంది, కుటుంబం ఉంది, ఆత్మగౌరవం ఉంది, మౌనమైన ప్రతిఘటన ఉంది. ఆయన కథల శక్తి వాటి సరళతలోనే ఉంది. ఆర్భాటం లేకుండా, చిన్న సంఘటనలతోనే ఆయన ఒక సమాజపు అంతర్గత జీవనాన్ని తెరపైకి తీసుకువస్తారు. పాఠకుడు చదివేది కేవలం కథ కాదు, ఒక అంతర్గత చరిత్ర.

స్కైబాబ రచనలో ప్రధాన బలం ప్రతినిధిత్వపు నిజాయితీ. ఆయన రాత "మన గురించి రాయండి" అన్న స్థాయిని దాటి, "మన జీవితాన్ని అర్థం చేసుకుని గౌరవంతో రాయాలి" అన్న సాహిత్య నైతికతగా మారుతుంది. అందుకే ఆయన రచనలో బాధతో పాటు గౌరవం కూడా ఉంటుంది.

అదే సమయంలో ఆయనలోని ద్వంద్వ నిజాయితీ ఆయనను ప్రత్యేకం చేస్తుంది. ప్రధాన సమాజం ముస్లింలను ఎలా పక్కకు నెడుతుందో ఆయన చూపిస్తారు; అలాగే ముస్లిం సమాజంలోని లోపాలను కూడా విమర్శిస్తారు. ప్రేమలో విమర్శ, విమర్శలో మానవత్వం ఇవి ఆయన రచనకు బలం.

ఇప్పటి కాలంలో సంభాషణ తగ్గి శబ్దం పెరుగుతోంది. వినడం కంటే తీర్పు చెప్పడం ఎక్కువైంది. ఇలాంటి సమయంలో అక్షరాన్ని నైతిక బాధ్యతగా మోసే రచయితలు మరింత అవసరం. స్కైబాబ అలాంటి రచయిత. ముస్లిం సమాజంలో అంతర్గత సంస్కరణల అవసరాన్ని గుర్తిస్తూ ఆయన "దునియాదారి" అనే సామాజిక వేదికను ఏర్పాటు చేసి పనిచేస్తున్నారు. మదర్సాల ఆధునీకరణ వంటి అంశాలపై వ్యాసాలు రాయడమే కాకుండా, "దీన్ కే సాత్ దునియా కో లేకే చలో" అనే నినాదంతో సామాజిక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. అలాగే ముస్లిం కథకులు, కవుల రచనలను సమీకరించి "జల్ జలా", "అజా", "అలావా", "ముఖామీ", "వతన్", "దర్ద్", "మిల్ ఝులే" వంటి సంకలనాలను వెలువరించారు. ఆయన రచనలు కేవలం తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లోకి కూడా విస్తరించాయి. ఆయన కథలు ఇంగ్లీషు, హిందీ, మలయాళ భాషల్లోకి అనువదింపబడి పుస్తకాలుగా వెలువడాయి. తాజాగా మరాఠీ అనువాదం కూడా వెలువడుతోంది. ఈ అనువాదాన్ని ముస్లిం సత్యశోధక్ మండల్ మహిళా విభాగం నాయకురాలు డా. బెనజీర్ తంబోలి చేశారు. ఈ కథలు ముందుగా వారి పత్రికలో ధారావాహిక గా ప్రచురితమయ్యాయి.

ఆయన రచనలో మరణం కూడా ఒక తాత్విక అనుభవంగా కనిపిస్తుంది. అది చీకటి కాదు, జీవితాన్ని మరొకసారి ఆలోచించే క్షణం. ఇంకా చెప్పాల్సిన సత్యాల పట్ల ఒక రచయితగా ఆయన బాధ్యత అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి రచయితకు "జాతీయ సమైక్యత" పేరిట అవార్డు రావడం ఎంతో సముచితం. ఎందుకంటే సమైక్యత అనేది కేవలం నినాదం కాదు. ఒకరి బాధను మరొకరు అర్థం చేసుకోవడం. స్కైబాబ రచన అదే లోతైన సమైక్యతను మోస్తుంది. తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన ఆయన, బహుజన సాహిత్య ఉద్యమంలోనూ తన వంతు కృషిని కొనసాగిస్తున్నారు.

ముస్లిం సత్యశోధక్ మండల్ వంటి లౌకిక, సంస్కరణ విలువలకు కట్టుబడి ఉన్న సంస్థ చేతుల మీదుగా ఈ గౌరవం రావడం మరింత అర్థవంతం. హమీద్ దల్వాయి ఆలోచనల నుంచి పుట్టిన ఈ సంప్రదాయం, స్కైబాబ అక్షరాన్ని గౌరవించడం యాదృచ్ఛికం కాదు, విలువల సహజ సంబంధం. "స్వాతంత్ర్యం" అనే పదం ఇక్కడ మరింత లోతుగా అర్థమవుతుంది. అది కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి కాదు; వివక్ష, మూఢత్వం, అన్యాయం నుంచి విముక్తి కూడా. ఆ రెండో స్వేచ్ఛ కోసం పోరాడే అక్షరమే నిజమైన సాహిత్యం. స్కైబాబ రచన ఆ దిశలో నిలుస్తుంది.

ఈ అవార్డును కేవలం వ్యక్తిగత విజయంగా చూడకూడదు. ఇది తెలుగు సాహిత్యంలో మరుగున పడిన అనుభవాలు సాధించిన స్థాయికి సంకేతం. స్కైబాబకు లభించిన ఈ గౌరవం ఆయనకు వచ్చిన అవార్డు మాత్రమే కాదు. అది గుర్తింపు దక్కని, నలిగిన మనుష్య గౌరవాన్ని సాహిత్య మధ్యలో నిలబెట్టిన అక్షరానికి వచ్చిన గౌరవం.

అక్షరం నిజంగా మనిషి వైపు నిలబడినప్పుడు, అది కేవలం రాత కాదు–సమాజం తనను తాను చూసుకునే అద్దం అవుతుంది.



**గాజోజి శ్రీనివాస్**
**9948483560**

## వద్దు బాబోయ్ వద్దు



ఊళ్ళో ఇద్దరు పేదోళ్ళు
తన్నుకుంటారు!
వాళ్ళిద్దరే పోతారు!
ఊళ్ళో ఇద్దరు ధనికులు
పొట్లాడుకుంటే
ఊళ్ళో జనం పోతారు!
నీతి ఏంటంటే
ధనికుల మధ్య
పొట్లాట వద్దు!
ఆ ధనికులిద్దరూ
ఊళ్ళో వడ్డీ వ్యాపారులే!
ఊరు రెండు ముక్కలు!
వాడి వెనక కొందరు
వీడి వెనక కొందరు
ఊరంతా వల్లకాడు!
దేశాలుకుడా అంతే!
వీళ్ళ యుద్ధాల మధ్య
జనం బలి పశువులు!
మేమంతా పేదోళ్ళం
మా మొర వినండి!
విభజించి పాలించుకోండి!
డబ్బున్న మారాజులరా!
దేశాధి'నేత'లారా!
మీరు పోట్లాడు కోవద్దు!
మీవి వ్యాపార యుద్ధాలు
ముష్టి యుద్ధాలు కాదు!
మిస్సెయిల్స్, బాంబులు!
పేదల్లో చీలికలు
వాళ్ల వరకే దరిద్రం!
చస్తే ఒకరిద్దరే!
మీరు పొట్లాడుకుంటే
దేశాలే వల్లకాడు!
సామాన్యుల మరణం!
వద్దు బాబోయ్ వద్దు
మమ్మల్ని ఇంకా దోచుకోండి
ఎలాగూ దరిద్రులమే!
మీరే లాభపడండి
కోట్లు పోగేసుకోండి!
ఎంతైనా దోచుకోండి!
ఊళ్ళో తగాదాలొద్దు
దేశాలకు యుద్ధాలొద్దు
ఆ రక్తపాతం చూడలేము!
మీరు 'పెద్దోళ్ళు'
పరమ కిరాతకులు!
ఆ రక్తం జనానిది!
వద్దు బాబోయ్ వద్దు
మేమే తన్నుకు చస్తాం!
ఇంకా మమ్మల్ని చీల్చండి
మీరు యుద్ధాలు మానండి
ఆ ఘోరాలు చూడలేము!
ఈ ఘోరకలి ఆపండి!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్



## లడ్తే.. లడ్తే.. ఏ అప్నా దం నిక్లే..

మధుర స్వరంతో వేలాది పాటలతో
కొట్లానుకోట్ల శ్రోతలను అలరించిన
అమర గాయని ఆశా భోంస్లే ఆకాంక్ష
గాతే గాతే దం నిక్లే ఏ మెరి ఆశా హై
పీడిత ప్రజల విముక్తికే తన జీవితం
అంకితం ఇచ్చిన విప్లవ యోధుడూ
భగత్సింగ్ వారసుడు ఆర్కే ఆకాంక్ష
జనంకొరకే జీవిస్తాం మరణిస్తాం కూడా
లడ్ తే.. లడ్ తే..ఏ అప్నా దం నిక్లే
జీవితాల్ని సార్థకం చేసుకోవ్వమంటే
వీర యోధులూ మీకే గదా సాధ్యం
వీరులూ మీ పురిటిళ్ళు పోరాటాలే!!

**డా. ఇక్బాల్ పాషా**
**9440775732**

# "విశ్వాసం కోల్పోతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలకు హెచ్చరిక!?"




ఇటీవలి కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు గమనిస్తే, ఒక ముఖ్యమైన సంకేతం స్పష్టంగా కనిపిస్తోంది. దేశాలు తమ సంపదపై మళ్లీ ప్రత్యక్ష నియంత్రణ సాధించాలనే తపన. ఫ్రాన్స్ తన బంగారం నిల్వలను అమెరికా నుండి వెనక్కి తీసుకువచ్చిందనే వార్త (అది పూర్తిగా నిజమో, అతిశయోక్తో వేరే విషయం) ఈ విస్తృత ధోరణికి ఒక ప్రతీకగా నిలుస్తోంది. ఈ పరిణామాన్ని కేవలం ఒక ఆర్థిక లావాదేవీగా కాకుండా, అంతర్జాతీయ విశ్వాస సంక్షోభం కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.ద్వితీయ ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన బ్రెట్టన్ ఊడ్స్ ఒప్పందం (Bretton Woods Agreement)ద్వారా అమెరికా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా మారింది. డాలర్ ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా స్థిరపడింది. ప్రపంచ దేశాలు తమ బంగారం నిల్వలను అమెరికాలో, ముఖ్యంగా "ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్" లో భద్రపరిచాయి. ఇది కేవలం భద్రత కోసం మాత్రమే కాదు; అమెరికా పై ఉన్న రాజకీయ, ఆర్థిక నమ్మకం వల్ల కూడా జరిగింది.

కానీ గత రెండు దశాబ్దాలలో ఆ నమ్మకం క్రమంగా దెబ్బతింటోంది. ముఖ్యంగా 2008లో జరిగిన గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ అమెరికా ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలను ప్రపంచానికి బహిర్గతం చేసింది. భారీ బ్యాంకులు కుప్పకూలడం, ప్రభుత్వ రక్షణ ప్యాకేజీలు, నిరుద్యోగం పెరగడం , ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని కదిలించాయి. ఈ సంక్షోభం తర్వాత ప్రపంచ దేశాలు "అమెరికా ఎప్పటికీ స్థిరంగా ఉంటుంది" అనే భావనను పునఃపరిశీలించడం ప్రారంభించాయి.

ఇక ఇటీవల కాలంలో అమెరికా ఆర్థిక విధానాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. భారీ రుణభారం, పెరుగుతున్న బడ్జెట్ లోటు, డాలర్‌పై అధిక ముద్రణ (మనీ ప్రింటింగ్) వంటి అంశాలు దీర్ఘకాలిక స్థిరత్వంపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఉదాహరణకు, అమెరికా ప్రభుత్వ ఋణం ట్రిలియన్ల డాలర్లకు చేరుకోవడం, దానికి వడ్డీ చెల్లింపులు కూడా భారీగా పెరగడం, ఇవి భవిష్యత్తులో డాలర్ విలువను దెబ్బతీసే ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి.

అంతేకాకుండా, అమెరికా తన ఆర్థిక శక్తిని రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కూడా ఒక ప్రధాన కారణం. రష్యా, ఇరాన్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం, వారి విదేశీ నిల్వలను ఫ్రీజ్ చేయడం వంటి చర్యలు ఇతర దేశాల్లో భయాన్ని కలిగించాయి. "ఈరోజు వారిపై, రేపు మనపై?" అనే ప్రశ్న చాలా దేశాల ఆలోచనల్లో చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే బంగారం వంటి భౌతిక ఆస్తులను తమ దేశంలోనే ఉంచుకోవాలనే అభిలాష పెరిగింది.

ఈ ప్రక్రియను "గోల్డ్ రిపాట్రియేషన్" (గోల్డ్ రిపాట్రియేషన్) అని పిలుస్తారు.జర్మనీ, నెదర్లాండ్స్ , హంగేరి వంటి దేశాలు ఇప్పటికే తమ బంగారం నిల్వలను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చాయి లేదా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇది అమెరికా పై నమ్మకం పూర్తిగా పోయిందని చెప్పడం కంటే, "స్వీయ నియంత్రణ" వైపు ప్రపంచం అడుగులు వేస్తోందని చెప్పడం సరైనది.

**ఇప్పుడు ప్రశ్న-అమెరికా ఎకానమీకి నిజంగా ఏమైంది? అది కుప్ప కూలిపోతుందా?**

సరళంగా చెప్పాలంటే, అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలిపోతున్నది కాదు. కానీ అది ఒక మార్పు దశలో ఉంది. ఒకప్పుడు ప్రపంచానికి ఏకైక ఆర్థిక కేంద్రంగా ఉన్న అమెరికా, ఇప్పుడు బహుళ కేంద్రాల ప్రపంచంలో ఒక ప్రధాన కేంద్రంగా మారుతోంది. చైనా వంటి దేశాలు ఆర్థికంగా ఎదగడం, బ్రిక్స్ వంటి వేదికలు ప్రత్యామ్నాయ వ్యవస్థలను ప్రతిపాదించడం...మొదలైన అన్నీ కలిసి అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి.

కానీ, అమెరికా డాలర్ ఇంకా ప్రపంచంలో ప్రధాన రిజర్వ్ కరెన్సీగానే ఉంది. దాని అధికారిక బెదిరింపులు అంతర్జాతీయ వాణిజ్యంలో, ముఖ్యంగా చమురు లావాదేవీలలో, డాలర్ ప్రాముఖ్యత కొనసాగుతోంది. కానీ అదే సమయంలో, కొన్ని దేశాలు తమ మధ్య వాణిజ్యాన్ని స్థానిక కరెన్సీల్లో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది డాలర్ ఆధిపత్యాన్ని క్రమంగా తగ్గించే ప్రక్రియ.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. బంగారం నిల్వలు కేవలం ఆర్థిక భద్రతకు సూచిక మాత్రమే. అసలు శక్తి ఆర్థిక ఉత్పత్తి, సాంకేతిక ఆవిష్కరణలు, సైనిక శక్తి, రాజకీయ స్థిరత్వం వంటి అంశాల్లో కూడా ఉంటుంది. ఈ పరంగా చూస్తే, అమెరికా ఇప్పటికీ ప్రపంచంలో అగ్రస్థానంలోనే ఉంది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి కంపెనీలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ అదే సమయంలో, అసమానతలు పెరగడం, మధ్య తరగతి క్షీణించడం, రాజకీయ విభజనలు పెరగడం వంటి అంతర్గత సమస్యలు అమెరికా ఆర్థిక వ్యవస్థను లోపల నుంచి బలహీనపరుస్తున్నాయి. చివరిగా చెప్పాలంటే, బంగారం రిపాట్రియేషన్ అనే ఈ పరిణామం ఒక హెచ్చరిక. అమెరికా ఆర్థిక పతనం ప్రారంభమైందని కాదు, కానీ ప్రపంచం మారుతోందని సూచిస్తుంది. అమెరికా ఆర్థిక విధానాలపై విశ్వాసం క్రమంగా క్షీణిస్తుంది. భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థ బహుళ ధ్రువాల (మల్టీపోలర్) రూపంలో ఉండబోతోంది. ఇప్పటికే ఒక ప్రశ్న తలెత్తుతుంది.అది చివరకు మన ముందే నిలుస్తుంది. ఒకే దేశం ఆర్థిక శక్తిపై ఆధారపడే ప్రపంచం సురక్షితమా? లేక విభజిత, సమతుల్య వ్యవస్థ మరింత స్థిరమా? ఈ సమాధానం రాబోయే దశాబ్దాల ఆర్థిక రాజకీయాలను నిర్ణయిస్తుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# భవిష్యత్తులో నిర్ణయాత్మక శక్తిని కోల్పోయే ప్రమాదంలో రాష్ట్రాలు

**.. నిన్నటి తరువాయి**


కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే స్థితికి చేరుకోవచ్చు. దక్షిణాది రాష్ట్రాల మద్దతు అవసరం లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కూటమి రాజకీయాల అవసరాన్ని తగ్గిస్తుంది. దక్షిణాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా తగ్గిపోతుంది.

ప్రస్తుతం కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రాష్ట్రాలు భవిష్యత్తులో నిర్ణయాత్మక శక్తిని కోల్పోయే ప్రమాదం ఉంది.

దీనివల్ల వారి అభిప్రాయాలు, అవసరాలు కేంద్ర నిర్ణయాల్లో తక్కువగా ప్రతిఫలించే అవకాశం ఉంది. పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం నిధుల కేటాయింపుపై కూడా ప్రభావం చూపుతుంది. కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలకు అభివృద్ధి పథకాల అమలులో తగ్గుదల కనిపించవచ్చు. మౌలిక వసతుల అభివృద్ధి అసమానంగా మారే ప్రమాదం ఉంది. సామాజిక, సాంస్కృతిక పరంగా కూడా ప్రభావం ఉంటుంది. భాషా, ప్రాంతీయ సంస్కృతి అంశాలు కేంద్రంలో తక్కువ ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. ఇది ప్రాంతీయ అసంతృప్తికి దారితీయవచ్చు. భారతదేశం సమాఖ్య వ్యవస్థను అనుసరిస్తుంది. ఈ వ్యవస్థలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఉండాలి. అయితే డీలిమిటేషన్ తర్వాత అసమానతలు పెరిగితే సమాఖ్య వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంది. ప్రాంతీయ విభేదాలు పెరిగే అవకాశం ఉంది.

దక్షిణాది రాష్ట్రాలకు ప్రధానంగా ఎదురయ్యే నష్టాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోవడం, కేంద్ర నిర్ణయాల్లో పాత్ర తగ్గిపోవడం, నిధుల కేటాయింపులో అన్యాయం, అభివృద్ధి వేగం మందగించడం, రాజకీయ ప్రభావం కోల్పోవడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

ఈ పరిస్థితిని సమతుల్యంగా పరిష్కరించడానికి కొన్ని మార్గాలు అవసరం. జనాభాతో పాటు అభివృద్ధి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి రాష్ట్రానికి కనీస ప్రాతినిధ్యాన్ని హామీ ఇవ్వాలి. రాజ్యసభ పాత్రను బలోపేతం చేయాలి. కేంద్ర నిధుల కేటాయింపులో సమతుల్యత పాటించాలి. మొత్తంగా చూస్తే డీలిమిటేషన్ ఒక అవసరమైన ప్రక్రియ అయినప్పటికీ, అది సమానత్వాన్ని కాపాడే విధంగా అమలు కావాలి. లేకపోతే అభివృద్ధిలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుంది. దేశ సమగ్ర అభివృద్ధి కోసం అన్ని ప్రాంతాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. లేకపోతే ప్రాంతీయ అసమానతలు పెరిగి దేశ ఐక్యతపై ప్రభావం చూపే



ప్రమాదం ఉంది.

మొత్తం విశ్లేషణను సమగ్రంగా పరిశీలించినప్పుడు డీలిమిటేషన్ అనే ప్రక్రియ భారత ప్రజాస్వామ్యంలో ఒక సాధారణ పరిపాలనా మార్పు మాత్రమే కాదని, భవిష్యత్తు రాజకీయ, ఆర్థిక, సామాజిక దిశలను ప్రభావితం చేసే కీలక నిర్ణయమని స్పష్టమవుతుంది. జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం ఇవ్వడం ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణమైనదే అయినప్పటికీ, అదే సమయంలో అభివృద్ధి, సామాజిక పురోగతి, జనాభా నియంత్రణలో సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం సంఖ్యల ఆధారంగా సీట్లను పునర్విభజించడం సమతుల్య విధానం కాదనే అభిప్రాయం బలపడుతోంది. దక్షిణాది రాష్ట్రాలు విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, కుటుంబ నియంత్రణ వంటి రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలిచాయి. ఈ రాష్ట్రాలు సమాజ నిర్మాణంలో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయాల ఫలితంగా జనాభా వృద్ధిని నియంత్రించగలిగాయి. అయితే అదే అంశం ఇప్పుడు పార్లమెంటులో వారి ప్రాతినిధ్యాన్ని తగ్గించే కారణంగా మారితే, అది ఒక విధంగా అభివృద్ధికి శిక్ష విధించినట్లుగా భావించబడే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో లోక్‌సభ సీట్లు 750 నుండి 888 వరకు పెరిగే అవకాశాల మధ్య ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరగడం, దక్షిణాది రాష్ట్రాలకు పరిమిత పెరుగుదల మాత్రమే ఉండడం వల్ల దేశ రాజకీయ సమీకరణంలో ఒక వైపుకే అధిక శక్తి కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు దక్షిణాది రాష్ట్రాల మద్దతు అవసరం లేకుండా పోవడం కూటమి రాజకీయ వ్యవస్థను బలహీనపరచడమే కాకుండా ప్రాంతీయ సమతుల్యతను కూడా దెబ్బతీయవచ్చు. ఇది కేవలం రాజకీయ ప్రభావంతో మాత్రమే పరిమితం కాదు. కేంద్ర నిధుల కేటాయింపు, జాతీయ ప్రాజెక్టుల పంపిణీ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలలో కూడా అసమానతలు పెరిగే అవకాశముంది. పార్లమెంటులో అధిక ప్రాతినిధ్యం కలిగిన ప్రాంతాలకు విధానాలు అనుకూలంగా మారే అవకాశాన్ని నిర్లక్ష్యం చేయలేము. దీని వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ ఆర్థిక పురోగతిని కొనసాగించడంలో సవాళ్లు ఎదుర్కొనే పరిస్థితి రావచ్చు.

అదే సమయంలో భాషా, సాంస్కృతిక, ప్రాంతీయ గుర్తింపుల పరిరక్షణ కూడా ఒక ముఖ్య అంశంగా నిలుస్తుంది. కేంద్రంలో ప్రాతినిధ్యం తగ్గితే ఈ అంశాలు తగిన స్థాయిలో ప్రతిబింబించకపోవడం వల్ల ప్రాంతీయ అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. ఇది సమాఖ్య వ్యవస్థకు కూడా సవాలుగా మారవచ్చు. భారతదేశం వంటి వైవిధ్యభరిత దేశంలో సమాఖ్య స్ఫూర్తి బలంగా నిలవాలంటే అన్ని రాష్ట్రాలకు సముచిత గౌరవం, సమాన ప్రాతినిధ్యం అవసరం. అందుకే డీలిమిటేషన్ ప్రక్రియలో కేవలం జనాభా ప్రమాణాన్ని మాత్రమే కాకుండా అభివృద్ధి సూచికలు, మానవ వనరుల పురోగతి, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం అత్యవసరం.

ప్రతి రాష్ట్రానికి కనీస ప్రాతినిధ్య హామీ ఇవ్వడం, రాజ్యసభను నిజమైన సమాఖ్య వేదికగా బలోపేతం చేయడం, ఆర్థిక వనరుల పంపిణీలో సమానత్వం పాటించడం వంటి చర్యలు తీసుకుంటే మాత్రమే ఈ అసమానతలను తగ్గించగలం. లేకపోతే డీలిమిటేషన్ ప్రక్రియ దేశంలో ప్రాంతీయ విభేదాలను మరింతగా పెంచే అవకాశం ఉంది.

చివరిగా చెప్పాలంటే, డీలిమిటేషన్ ఒక సంఖ్యల మార్పు మాత్రమే కాదు; అది భారతదేశ భవిష్యత్తు రాజకీయ సమీకరణాన్ని తిరగరాసే శక్తి కలిగిన ప్రక్రియ. ఇది సమానత్వాన్ని కాపాడే దిశగా అమలు అయితే దేశ ఐక్యత బలపడుతుంది. లేకపోతే ప్రాంతీయ అసమానతలు పెరిగి సమాఖ్య వ్యవస్థకు సవాలు ఏర్పడే ప్రమాదం ఉంది. అందువల్ల ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, సమతుల్య దృష్టితో, అన్ని ప్రాంతాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అమలు చేయడం కాలానుగుణ అవసరం.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 21న మండల కేంద్రాలు, 4 మున్సిపాల్టీలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ,సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకం,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సన్న వడ్ల బోనస్,ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు,ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, వినిపించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్



కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టాలన్నారు.. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. అనంతరం వేసవికాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకునే విధంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ క్షేత్రస్థాయిలో ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో తాగునీటి సమస్యకు నిర్మూలనకు కృషి చేయాలని, నీటి ఎద్దడి ముందుగా గుర్తించిన పక్షంలో ప్రత్యామ్నాయ చర్యల ద్వారా సమస్యను పరిష్కరించాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఎండలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలనివేసవిలో ప్రజలు ఎండలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ అధికంగా ఉంటుందని ప్రజలు బయటికి వెళ్లొద్దని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బబారిన పడే అవకశాలున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వడదెబ్బకు గురైతే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎండల్లో చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం చేయొద్దని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపితో కవరు చేసుకోవాలన్నారు. తరచుగా మంచినీళ్లు త్రాగాలని సూచించారు. మజ్జిగ, నిమ్మరసం, ఉప్పు పంచదార కలిపిన ద్రావణం, ఓఆరెస్ తీసుకోవాలని తెలిపారు. వదులుగా ఉన్న కాటన్ దుస్తువులు ధరించాలని తెలిపారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా షేడ్ నెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఎండదెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ఎస్ శివదయాల్, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస్, డీఎఫ్ఓ జో.జి , జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిపిఓ యాదయ్య, ఆర్ అండ్ బి ఈ.ఈ వేణు,ఆర్.డబ్ల్యూ.ఎస్ మిషన్ భగీరథ. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రవాణాకు అనుమతులు తప్పనిసరి

- ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్ లతో పాటు రెవెన్యూ,వాటర్ షెడ్ పరిధిలోని చెక్ డ్యాం ల వద్ద నుంచి ఇసుక రవాణా చేసేందుకు అనుమతులు తప్పని సరి అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి (డిస్టిక్ లెవెల్ స్యాశీడ్ కమిటీ) సమావేశం గూగుల్ మీట్ ద్వారా జరిగింది. వీసీ హాల్ నుంచి కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, భూగర్భ జల వనరుల శాఖ ఏ డీ రవి, కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, మిషన్ భగీరథ ఎస్. ఈ. రంగారావు,ఇరిగేషన్ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక తరలింపు విషయంలో మైనింగ్, రెవెన్యూ, భూగర్భ జల శాఖ,సర్వే ల్యాండ్, నీటి పారుదల,వ్యవసాయ శాఖల అధికారుల నివేదికలు,అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఇరిగేషన్, నీటి జల వనరుల శాఖ ఏ డీ ని ప్రశ్నించారు. మాగనూరు మండలంలోని 5 ఇసుక రీచ్ లు, ఉట్కూర్ మండలంలో 2, మక్తల్ లో రెండు,ధన్వాడ గోటూరు, కొత్తపల్లి, లింగాల చేడ్ రీచ్ ల నుంచి ఇసుక రవాణా కు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని మైనింగ్ ఏడి వివరించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి నిబంధనల మేరకు ఇసుక రవాణా కు అనుమతులు ఇవ్వాలని, ఆయా ప్రాంతాలలో సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి, పారదర్శక మైన నివేదికలను ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఒకరిద్దరు తహసీల్దార్ల పనితీరు పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.గూగుల్ మీట్ లో ఆయా మండలాల తహ సీల్దార్లు, సిఐలు,ఎస్.ఐ. లు, కలెక్టరేట్ లోని సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## రైతుల పంటలు కాపాడటమే ధ్యేయం

- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** రైతుల పంటలు కాపాడడమే మా ధ్యేయమని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ఘన్పూర్ ఆయకట్టుకు నీటి విడుదల విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఒక ఆర్డర్ ఇస్తూ మంజీరా బ్యారేజ్ నుంచి నీరు విడుదల చేయడం జరిగింది... గత 15-20 రోజుల క్రితం నీరు విడుదల చేసి ఉంటే దాదాపు 20వేల ఎకరాల పంట కాపాడుకునే వాళ్ళం... ప్రభుత్వం ఎందుకు మొండి పట్టు పట్టిందో... ఎవరైనా రాజకీయం చేశారో మాకైతే తెలియదు అని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ శాసనసభ్యురాలిగా ఘనపూర్ ఆనకట్ట కింద సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో అసెంబ్లీలో మాట్లాడడం జరిగింది అన్నారు. అలాగే మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, వేం నరేందర్ రెడ్డిని, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన తర్వాత మంజీరా బ్యారేజ్ నుంచి ఘన్పూర్ ఆనకట్టకు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. 99 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలు 420 హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. ఈ ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రైతులు, మహిళలు బి ఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడే బాగుండేదని అంటున్నారని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీయే నని, కెసిఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రవితేజరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ముత్యంగారి సంతోష్ మేఘమాల, మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అరిగే రమేష్ కుమార్, సహకార సంఘం అధ్యక్షులు మనోహర్, సర్పంచులు వినోద్, మోత్కు నిర్మల మల్లేశం, యోహన్, స్వామి, గీతా రమేష్, కొరబోయిన లక్ష్మీ పెంటయ్య, నాయకులు వేమారెడ్డి, గౌరీ శంకర్, సిద్ధిరాములు, జంగిటి పోచయ్య, మహేష్, ధనరాజ్, మాజీ సర్పంచులు గోదావరి, యాదయ్య , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బావిగి భద్రేశ్వర జాతర బ్రహ్మోత్సవాలు విజయవంతం

**తాండూరు, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** శ్రీ బావిగి భద్రేశ్వర జాతర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు మేడి మహేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు మేడి మహేష్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ బావికి భద్రేశ్వర జాతర బ్రహ్మోత్సవాలు ఉగాది పర్వదినాన రథచక్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యంగా జాతర ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జాతర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టితో ఎప్పటికప్పుడు ఉత్సవాలపై ఎలా జరుగుతున్నాయని ఆరా తీసారని, సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మా ఆహ్వానం మేరకు రథోత్సవానికి విచ్చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జాతర బ్రహ్మోత్సవాలను తమ కుటుంబంలోని పండుగల భావించి సహకరించిన వీరశైవ సమాజ సంఘ పెద్దలు, యువదళ్ సభ్యులు, మహిళా మండలి సభ్యులు, భజన మండలి సభ్యులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఐదు రోజుల్లో పాటు స్వామివారి పల్లకి సేవను వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా ప్రజలమండలి సభ్యుల సహకారం ఎనలేనిదని అన్నారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు సహకరించిన ఆర్డిఓకి, రెవిన్యూ



వ్యవసాయ వైద్యశాఖలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా జాతర ఉత్సవాలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్న పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి అధ్యక్షులు మేడి మహేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వీరశైవ సమాజ సభ్యులు లింగదల్లి రవికుమార్, ఫెస్టివల్ కమిటీ సభ్యులు గంగా శ్రావణ్ కుమార్, గాజుల విజయ్ కుమార్, లింగమంతుల శంకర్, శెట్టి చంద్రకాంత్, మాద్రికి చంద్రకాంత్, కోర్వార్ అంజలి,అగ్గనూరు సంకేత్, నాయకులు కోరవార్ నగేష్ పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు




**తలకొండపల్లి, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలను పొందవచ్చని రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు మరింత ముందుకు రావాలని ఉద్యాన పట్టు పరిశ్రమ ఏపీడి కిషన్ రావు అన్నారు.బుధవారం మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో రైతులు పెంటారెడ్డి,సాయి రెడ్డి ఆయిల్ ఫామ్ తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పంట సాగు పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏపీ డి కిషన్ రావు,ఆర్టికల్చర్ ఆఫీసర్ హిమబిందు మాట్లాడారు.రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వరి,తోపాటు పంట మార్పిడి విధానంలో కూరగాయలు,పండ్లతోటల పెంపకం చేపట్టాలన్నారు.ఎకరా ఆయిల్ ఫామ్ సాగుకు రూ,50 వేల వరకు మొక్కలు,డ్రిప్పు,పాండ్ నిర్వహణకు వివిధ రకాలుగా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు.మూడేళ్ల పాటు ఆయిల్ ఫామ్ సాగు చేస్తే..నాలుగో ఏడాది నుంచి ఆదాయం వస్తుందన్నారు.రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగుపై మరింత దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్ మోహన్ రావు,సీతారాం,ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్,బదునాపూర్ వార్డు సభ్యులు లక్ష్మీకాంత్ గౌడ్,రైతులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ఎల్‌పీజీ గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు



**సంగారెడ్డి, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ఎల్పిజి గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఎల్పిజి సరఫరా మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి లతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ, పోలీస్ శాఖల అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ...జిల్లాలో ఎల్పిజి వంట గ్యాస్ కొరత లేదని, ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా అందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. జిల్లాలో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టింస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన వంట గ్యాస్‌ను ఇంటి వద్దకే సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గ్యాస్ సరఫరా పరిస్థితిపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్,. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ కొరత రాకుండా స్రా+ సరఫరా కొనసాగించాలని సూచించారు. గ్యాస్ పంపిణీలో అక్రమాలు జరగకుండా విజిలెన్స్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమ నిల్వలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిపడా స్టాక్ ను నిర్వహించడంతో పాటు అదనంగా 15 శాతం నిల్వలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అలాగే గ్యాస్ ఏజెన్సీలు అవసరమైన స్టాక్‌ను ముందుగానే సమకూర్చుకుని, వినియోగదారుల నిజమైన బుకింగ్‌లను కచ్చితంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుని ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా జరిగేలా అధికారులు కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి ఏం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్ , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారు (ఇంచార్జ్) రాజేశ్వర్, రవాణా శాఖ అధికారిణి అరుణ , సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, డి ఎల్ ఏం ఓ ఏం అనిల్ కుమార్ , ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పి.ప్రతాప్ రెడ్డి, జె.మురళీధర్ రెడ్డి, వై.వినోద్ కుమార్, పోలీస్ శాఖ అధికారులు , సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఇళ్ల లబ్ధిదారులకు అదనంగా లక్ష రూపాయలు ఇవ్వాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**కొల్చారం, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీ ఇళ్ల లబ్ధిదారులకు అదనంగా లక్ష రూపాయలను వెంటనే ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో రఫీకున్నిసా అధ్యక్షతన జరిగిన సమావేశంలో 51 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మొదటి విడతలో నర్సాపూర్ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గానికి 851 ఇల్లు మంజూరు కాగా, కొల్చారం మండలానికి 51 ఇల్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇంకా అర్హత ఉండి ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్న వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎవరు ఆందోళన చెందకండి... అందరికీ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఇల్లు మంజూరు పత్రాలను ఎంపీడీవో రఫీకున్నిసా, హౌసింగ్ డీఈ ప్రభు, హౌసింగ్ ఏఈ సుష్మ, ఆయా గ్రామాల సర్పంచ్ లతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రవితేజరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ముత్యంగారి సంతోష్ మేఘమాల, మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అరిగే రమేష్ కుమార్, సహకార సంఘం అధ్యక్షులు మనోహర్, సర్పంచులు పాల్గొన్నారు.

# మోహిజ్ సాధించిన విజయం రాష్ట్రానికి గర్వకారణం


- అంతర్జాతీయ స్థాయిలో భారత జెండాను ఎగరవేసిన యువ క్రీడాకారుడు
- మోహిజ్‌కు అక్షర పాఠశాల ఘన సన్మానం
- పాఠశాల ప్రిన్సిపాల్ మోహన కృష్ణ గౌడ్

**తాండూరు, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** పట్టణానికి చెందిన ప్రతిభావంతుడైన యువ క్రీడాకారుడు మోహిజ్ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటి, భారతదేశానికి గర్వకారణంగా నిలిచాడు. నేపాల్ దేశ రాజధాని ఖాట్మండు నగరంలో ఏప్రిల్ 7 నుండి 9 వరకు నిర్వహించిన అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలలో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన మోహిజ్, అద్భుత ప్రతిభ కనబరచి జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించి గోల్డ్ మెడల్ సాధించాడు. మొత్తం ఐదు మ్యాచ్‌లలో భారత జట్టు విజయం సాధించడం గర్వకారణం.ఈ విజయోత్సాహంలో భాగంగా, తాండూర్‌లోని అక్షర పాఠశాల ఆధ్వర్యంలో మోహిజ్‌కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల



యాజమాన్యం అతనికి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించడమే కాకుండా, ఆర్థిక ప్రోత్సాహాన్ని కూడా అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మోహన కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మోహిజ్ సాధించిన విజయం కేవలం అతని వ్యక్తిగత విజయమే కాదు.తాండూర్ పట్టణం మరియు మన రాష్ట్రానికి గర్వకారణం. కఠోర శ్రమ, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ స్థాయికైనా ఎదగవచ్చని మోహిజ్ నిరూపించాడు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని, దేశానికి మరిన్ని పతకాలు అందించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యమని, క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ధైర్యం, మరియు సమయపాలన పెరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు సీ. ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ కులకర్ణి, రవీందర్ రెడ్డి, యండి యూనస్, శోభా రాణి పాల్గొని మోహిజ్‌ను అభినందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై హర్షధ్వానాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అక్షర పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ మా పాఠశాల ఎల్లప్పుడూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తోంది. క్రీడలలో రాణించే విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శనం అందిస్తూ, భవిష్యత్ చాంపియన్లను తీర్చిదిద్దడం మా లక్ష్యం" అని తెలిపారు.ఈ ఘన సన్మాన కార్యక్రమం తాండూర్ పట్టణంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో ఒక ప్రేరణాత్మక ఘట్టంగా నిలిచింది.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**మెదక్, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. బుధవారం చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే సందర్భంగా మెదక్ మండలంలోని ముక్త భూపతిపూర్ లో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లల సైతం వాహనాల మీద తీసుకెళ్లేటప్పుడు హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పక ధరించాలని అన్నారు. మైనర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ ఓవర్ స్పీడ్ వాటి జోలికి పోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు.

# అబార్షన్ కేసుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** జిల్లాలో అబార్షన్ కేసుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కేసు వెనుక ఉన్న కారణాలు, చోటుచేసుకునే ప్రాంతాలపై సమగ్ర పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ గోపాలపేట మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఈడీడీ (ఈ డి డి) డెలివరీ రిజిస్టర్లను పరిశీలించి, ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు మరియు అబార్షన్ ల వివరాలపై విచారణ చేశారు. అబార్షన్ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. అబార్షన్ ల కారణాలు, అవి ఎక్కడ జరుగుతున్నాయి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఆసుపత్రిలో మెరుగైన సేవల కోసం అవసరమైన సదుపాయాలపై ప్రతిపాదనలు ఫైల్ రూపంలో సమర్పించాలని అధికారులకు సూచించారు.



మహిళలకు హెచ్పివి వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

### పోలికపాడులో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

గోపాలపేట మండలం పొలికేపాడు గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల విడుదలకు సంబంధించిన విషయాన్ని తెలుసుకున్నారు. గ్రామంలో మంజూరైన 35 ఇళ్లలో 34 ఇళ్లు గ్రౌండింగ్ పూర్తి కాగా, 3 ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు తదుపరి దశలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

### ఇందిరమ్మ నమూనా ఇల్లు పరిశీలన

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ శైలి, ఇతర వివరాలను తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ మాట్లాడుతూ, ఈ భవనం త్వరలో అసిస్టెంట్ ఇంజనీర్ (హౌసింగ్) కార్యాలయంగా ఉపయోగంలోకి వస్తుందని తెలిపారు.

అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయం లో సెన్సస్ (జన గణన) ప్రక్రియపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ వేగంగా హెచ్ ఎల్ బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్స్) గుర్తించి, డిమార్కేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.హౌసింగ్ పీడీ విటోభా, సీపీ ఓ హరికృష్ణ, తహసీల్దార్ తిలక్, వైద్య అధికారులు ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## విద్యుత్ సంస్థలో పనిచేసే ఎంప్లాయిస్‌ను పర్మినెంట్ చేయాలి



**నారాయణపేట, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** నారాయణ పేట్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ కార్యాలయం ముందు జరిగే విద్యుత్ ఎంప్లాయిస్ "నిరవధిక సమ్మె" శిబిరాన్ని టి యు డి ఐ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. కాశీనాథ్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అంబదాస్‌లు సందర్శించి బుధవారం సమ్మెకు కార్మిక సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా "కారంటోల సమ్మె" జరుగుతుంది. దీనికి ప్రజలు, విద్యుత్ వినియోగ దారులు, మేధావులు, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు సంపూర్ణ మద్దతు తెలియజేయాలనీ కోరారు. తోటి కార్మికులు గత 20-25 సంవత్సరాల నుండి కార్మికులు చాలి చాలని తక్కువ జీతాలతో విద్యుత్ శాఖలో పనిచేస్తున్నారనారు. శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. శ్రమ దోపిడీకి గురువుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు .టిఆర్ఎస్ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తున్నామని నమ్మించి మోసం చేసిందనీ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విద్యుత్ వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ లు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నా యనీ విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా "కంట్రాటీకరణ "విధానాన్ని ప్రపంచ బ్యాంకు కు తలొగ్గి భారతదేశంలో అమలు చేస్తా ఉన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు వ్యతిరేకించాలనారు. వెంటనే ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేసే ఎంప్లాయిస్ ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల నాయకుడు నీలి దామోదర్,సి పి ఎం నాయకులు వెంకట్ రామిరెడ్డి,బలరాం, వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించాలి



**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** వాహనాల నడిపే సమయంలో హెల్మెట్ ధరించండి,మద్యం సేవించి వాహనాలు నడపకండి, రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మీకేమైనా జరిగితే మీ కుటుంబం రోడ్డున పడుతుంది, వయసులో ఉన్న మీ పిల్లలు అనాథలుగా మారుతారు అంటూ, రోడ్డు సేఫ్టీ నియమాలపై ప్రయాణికులకుబుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద విద్యార్థులకు వాహనదాలకు ఎస్సై నారాయణగౌడ్అవగాహణ కల్పించారు. విద్యార్థులు. పాఠశాల విద్యార్థులచే వాహన దారులు రోడ్డు పైన ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు. జాతీయ ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపే వారిని, సీట్ బెల్ట్ లేకుండా కార్లు,పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించుకునే ఆటోలను ఆపి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని విద్యార్థులు చేసే సూచనలు పలువురిని ఆకర్షించింది. వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాల భద్రతే పోలీస్ శాఖ లక్ష్యం

- ఐజి చంద్రశేఖర్ రెడ్డి

**తూప్రాన్, ఏప్రిల్ 14 (జనం సాక్షి) :** ప్రజల ప్రాణాల భద్రత పోలీసు శాఖలక్ష్యమని ప్రతి ఒక్కరు వాహనదారులు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని ఐజి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మనోహరాబాద్ మండలంలోని కలకల్ లో జరిగిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. డ్రైవర్స్‌కు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించి, డ్రైవర్లకు పలు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను ప్రజలు అలవాటు చేసుకోవాలనీ,తూప్రాన్ కాలకాల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘనంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,వాహన చోదకులు హెల్మెట్ తప్పక




తీసుకోవాలన్నారు. రోడ్డుపై ప్రయాణించేటపుడు ఎదుటి వారి అజాగ్రత్తలను కూడా గమనించి ప్రయాణించాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ,ప్రతి సం; దాదాపు 7000 ప్రమాదాలు జరుగుతున్నాయని, జాగ్రత్త లే ప్రమాదాల నివారణకు మార్గమన్నారు. రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా తయారు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు.ప్రతి గ్రామంలో రోడ్డు భద్రతపై గ్రామ కమిటీని వేశామని అవి ప్రతి వారం వారం సమావేశమై యువతకు పలు సూచనలు చేస్తారని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, డీఎస్పీలు నరేందర్ గౌడ్ సిఐ రంగాకృష్ణ ఎస్ఐ సుభాష్ గౌడ్, స్థానిక సర్పంచ్ నవ్య, నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రవీణ్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** జిల్లాలో ఉపాధి హామీ పథకంకింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, డిఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా లో చేపట్టిన స్కూల్ కాంపౌండ్ వాల్స్ , పాఠశాలల మరుగుదొడ్లు, జీపీ బిల్డింగ్స్, మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులు నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతతో చేపట్టి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న పనుల ప్రగతి సంతృప్తికరంగా లేని చోట వెంటనే చర్యలు తీసుకోవాలని, పనుల్లో ఆలస్యం జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో కాంపౌండ్ వాల్‌లు, టాయిలెట్స్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు భద్రతా వాతావరణం కల్పించాలని అన్నారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం ద్వారా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని, ఈ



పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పర్యవేక్షణ పెంచి, పనుల నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు తమ తమ విభాగాల పనుల ప్రగతిపై వివరాలు సమర్పించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, పీడీ డిఆర్డిఏ జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ నాగేష్ స్పష్టం చేశారు. బుధవారం చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే సందర్భంగా మెదక్ మండలంలోని ముక్త భూపతిపూర్ లో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లల సైతం వాహనాల మీద తీసుకెళ్లేటప్పుడు హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పక ధరించాలని అన్నారు. మైనర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ ఓవర్ స్పీడ్ వాటి జోలికి పోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొమ్ము పవన్ వాడు నెంబర్లు ఎస్సై లింగం పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సమన్వయంతో కేసులు పరిష్కరిద్దాం

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ ,కర్ణాటక రాష్ట్రాల్లో రెండు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో కేసులు పరిష్కరిద్దాం అని అధికారులు నిర్ణయించా రు.బుధవారం సరిద్దు కర్ణాటక రాష్ట్రంలోని రైచూర్ జిల్లా శక్తి నగర్ గెస్ట్ హౌస్‌లో రైచూర్ జిల్లా ఎస్పీ అరుణ్ష్ గిరి ఆధ్వర్యంలో బోర్డర్ పోలీసు అధికారులతో సమన్వయ క్రైమ్ మీటింగ్ నిర్వహించారు.ఈ సమా వేశంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, నారాయణపేట జిల్లాల ప్రతినిధులు, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా తరఫున మక్తల్ సీఐ శ్రీ రామ్ లాల్, కృష్ణ ఎస్ఐ ఎస్.ఎం. నవీద్ హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో చట్టం,శాంతి భద్రతలు కాపాడేందుకు పరస్పర సమన్వయం ఎంతో కీలకమని ఈ సందర్భంగా అధికారులు




పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య నేరస్తుల కదలికలను అరికట్టడం, నేరాల నియంత్రణలో సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం కోసం సమాచారం పంచుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో ప్రధానంగా క్రింది అంశాలపై విస్తృతంగా చర్చించారు. పరారీలో ఉన్న నేరస్తుల వివరాల పరస్పర వినిమయం అమలుపై సమన్వయం మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం సమాచార మార్పిడిరోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంయుక్త చర్యలుగుర్తుతెలియని మృతదేహాల గుర్తింపు దొంగతనాలు మరియు ఇతర నేరాల నివారణకు ముందస్తు చర్యలుఅంతేకాకుండా, బార్డర్ ప్రాంతాల్లో జరిగే నేరాలపై తక్షణ సమాచార మార్పిడి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి, నిరంతరం అప్డేట్స్ షేర్ చేసుకోవాలనినిర్ణయించారు.ఈ తరహా సమన్వయ సమావేశాలు సరిహద్దు ప్రాంతాల్లో నేర నియంత్రణకు ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.రాష్ట్రాల మధ్య సమన్వ యంతో పని చేయడం ద్వారా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు.

## అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి



**కల్వకుర్తిరూరల్, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** కల్వకుర్తి మున్సిపాలిటీలో ఉన్నటువంటి 24అంగన్వాడీ సెంటర్ లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు.బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వైస్ ఛైర్మెన్ శానవాజ్ ఖాన్ తో కలిసి అంగన్ వాడీ ఐసిడిఎస్ సూపర్ వైజర్,అంగన్ వాడి టీచర్ లతో సమావేశం ఏర్పాటు చేశారు.అంగన్ వాడిలకు పక్క భవనాలు,వాటిలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం,మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సుమారు 15 అంగన్వాడీలకు స్వంత భవనాలు లేవని వాటికీ మున్సిపల్ నుండి స్థలాలు కేటాయించి, కల్వకుర్తిశాసనసభ్యులుకసిరెడ్డి నారాయణ రెడ్డిసహకారంతో భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తామని కాల్ చైర్పర్సన్ బృంగి రత్నమాలఆనంద్ కుమార్ తెలిపారు.

## కళలు మానసిక ఆనందాన్నిస్తాయి



**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** కళలు మానసిక ఆనందాన్నిస్తాయని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.ప్రపంచ కళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక బాలభవన్ లో బాలభవన్ కళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రజల కోసం అన్న విధంగా వివిధ రంగాలలో కళా సేవనందిస్తున్నవారు వనపర్తి జిల్లాలో ఎంతో మంది ఉన్నారని వారి స్ఫూర్తితో రానున్న తరం మన ప్రాచీన సంప్రదాయ కళలను బ్రతికిశీచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలభవన్ సిబ్బంది లావణ్య,ప్రసన్న, నిరీష,సాజిద బేగంలను శాలువ జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.వారి కళాసేవను ఆయన కొనియాడారు.ఈనాటి కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్ర శేఖర్,దేశి రాములు యాదవ్,బండారు శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్ చారి,మద్దిలేటి, రమేష్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (ఇండ్ల గణన) ప్రక్రియను పారదర్శకంగా, నిర్దిష్ట విధానాలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇండ్ల గణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఫస్ట్ ఫేజ్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల గణనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఖచ్చితమైన విధానాలను పాటిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.

ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఈ నెల 18వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనితీరును సమీక్షించాలని సూచించారు. అదేవిధంగా స్వయంగా వివరాలు నమోదు చేసుకునే వారికి (సెల్ఫ్ ఏనుమేరేషన్ ) ఏప్రిల్ 26 నుండి మే 10వ తేదీ వరకు అవకాశం కల్పించబడుతుందని, దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సీపీఓ కార్యాలయ ఏడి గీత, ఎం. కె. నాయక్, ఇంద్రసేనారెడ్డి, ఈడీఎం ఉదయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమానికి సంపూర్ణ సహకారం



**రామచంద్రాపురం, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రామచంద్రాపురం ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కాశీ, అయోధ్య, ఢిల్లీ విహారయాత్రను బుధవారం ఉదయం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విహారయాత్ర కోసం రూ.15 లక్షలను సొంత నిధుల నుంచి అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, జీవితంలో అపార అనుభవం కలిగిన పెన్షనర్లు నియోజకవర్గ అభివృద్ధికి తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు. గత దశాబ్ద కాలంగా పెన్షనర్ల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, వారికి సొంత భవనం కూడా నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. పెన్షనర్ల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. తమ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు పెన్షనర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పరమేష్ యాదవ్, ఐలేష్, ప్రమోద్ గౌడ్, పెన్షనర్ల సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, రాములు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 ఏప్రిల్ 2026

# అంతుచిక్కని వ్యాధితో 56 గొర్రెల మృతి

- తీవ్రంగా నష్టపోయిన గొర్రెల కాపరి
- సాయం చేయండి సారు అని జిల్లా కలెక్టర్ ని కలిసిన గొర్రెల కాపరి



**చందంపేట, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** నేరేడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఊరపాయ తండాలో అంతుచిక్కని వ్యాధితో సుమారు 56 గొర్రెలు మృతి చెందడం కలకలం రేపింది. స్థానికంగా నివసిస్తున్న రామావత్ హనుమా పేద కుటుంబానికి చెందిన గొర్రెలు ఒకే దొడ్డిలో మూడు రోజుల వ్యవధిలో వరుసగా చనిపోయాయి. ఈ గొర్రెలే వారి జీవనాధారం కావడంతో ఒక్కసారిగా జరిగిన నష్టం కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది.మరి కొన్ని గొర్రెలు మేత మేయకుండా అడ్డం పడిపోవడంతో కాపరి కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. మృతిచెందిన గొర్రెలను పొలంలోనే వదిలి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మారుమూల ప్రాంతానికి చెందిన ఈ కుటుంబానికి గొర్రెలే జీవనాధారం కావడంతో ఒక్కసారిగా ఈ నష్టం వాటిల్ల డంతో వారు దిక్కుతోచని పరిస్థితిలోకి చేరుకున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించడంతో పాటు, మిగిలిన గొర్రెలకు వైద్యసేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రత్యేక బృందం పరిశీలన**

బుధవారం నల్గొండ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి వి రమేష్ ఆధ్వర్యంలో ఉరబాయి తండాలో ఆయన ప్రత్యేక బృందంతో మృతి చెందిన గొర్రెల పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గొర్రెలను మా వైద్యులచే . వైద్యం ఇస్తున్నమని..చనిపోయిన గొర్రెలను దేని కారణంగా చనిపోతున్నాయో తెలుసుకోవడం కోసం శాంపిల్స్ తీసి ప్రత్యేకమైన ల్యాబ్ పంపించి రిపోర్ట్ ఆధారంగా మురుగైన వైద్యం. ఇచ్చేందుకు మేము ప్రయత్నిస్తున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి ధనలక్ష్మి చందంపేట. డాక్టర్ నాగయ్య కొండమల్లేపల్లి. డాక్టర్ నర్మద నేరేడుగొమ్ము పాల్గొన్నారు.

## టీపీఎస్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన



**దేవరకొండ, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మేరేగు పరుచుట కొరకు బుధవారం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ప్రీ-ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు విద్యను అందించే విధంగా ఆధునిక సదుపాయాలతో తెలంగాణ మోడల్ స్కూల్ లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉన్నత పాఠశాల లే-అవుట్ ప్రకారం తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉందని కలెక్టర్ అన్నారు.ఈ మోడల్ స్కూల్ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ఒకే చోట ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందుబాటులో ఉంటుందని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డైనింగ్ హాల్, కిచెన్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు,. మూత్రశాలలు (టాయిలెట్లు), బాత్రూములు, విశాలమైన ఆట స్థలం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అలాగే విద్యార్థుల రవాణా కోసం బస్సుల సదుపాయం కల్పించబడుతుందని,నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమం లో,ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో పార్వతి, పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రతి పేద వారి సొంత ఇంటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** అతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చమని ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన గూడెం చంద్రకళ, ఇందిరమ్మ ఇంటిని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మి ప్రసన్న శేఖర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. పేదల గృహ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతేకాకుండా, పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలంటే సొంత ఇల్లు అత్యవసరమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సర్పంచ్ కావలి లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెంటయ్య గౌడ్, సింగప్పగూడెం, సర్పంచ్ రవి, తల్లారం దుద్దాగు ఉప సర్పంచ్ మొహమ్మద్ నవాజ్, చేవెళ్ల మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పడాల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ న్యాలట బుచ్చయ్య, వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యత



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** జిల్లాలో భూగర్భ జలాలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో బుధవారం భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన భూగర్భ జలాల వినియోగం -సంరక్షణ పై జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూగర్భజ లాల భూగర్భ జలాల వివరములు,భూగర్భ జలాల లభ్యత, వినియోగం, వర్గీకరణ, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వర్షపు నీటి సేకరణ, నీటి సంరక్షణ నిర్మాణాలు- నిర్వహణ పై కలెక్టర్ చర్చించారు. భూగర్భ జల వనరుల శాఖ ఏ డీ రవి మాట్లాడుతూ భూగర్భ జలాల లభ్యత, వినియోగం, మండలాల వారీగా వర్గీకర ణను, నీటి ప్రాముఖ్యతను తెలియజేశారు. వ్యవసాయా నికి భూగర్భజల వనరులపై ప్రధానంగా ఆధారపడటం తగ్గించు కోవాలని పరిమి తంగావినియోగించుకోవాలని కోరారు.నీటిని సృష్టించ లేం కానీ సంరక్షించుకోగలం అనే విషయాన్ని గుర్తుంచు కోవాలని,ఇష్టారాజ్యంగా భూగర్భజలాల్ని వెలికితీయడం కాకుండా వాన నీటిని సాధ్యమైనంత వరకు భూమిలో ఎక్కువగా లోపలి ఇంకింప చేసే విషయాలపై దృష్టి పెట్టాలని నీటి సంరక్షణ మనఅందరి సామాజిక బాధ్యత అన్నారు.అనంత రం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నారాయణపేట జిల్లా క్రియాశీలక భూగర్భ జల వనరులు పుస్తకం విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, సీపీవో ఖాఘవాహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిఎం ఇండస్ట్రీస్ రామలింగేశ్వర గౌడ్, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలు ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందించాలి



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సెర్ఫ్ సిబ్బందిని ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సెర్ఫ్ సిబ్బందికి నిర్వహించిన ఉద్యమి ఆధార్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల్లో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేస్తున్న చిన్న తరహా వ్యాపారాలకు సంబందించిన ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అందుకు తగిన విధంగా ప్రతి మండలంలో 10 నూతన వ్యాపారులను గుర్తించి జూన్ 2 వరకు గ్రౌండింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పిడి శిరీష, జిల్లా పరిశ్రమల అధికారి ప్రవీణ్ కుమార్, శోభారాణి, డీఆర్డీఏ అదనపు సంచాలకులు సురేష్, ట్రైనర్ రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



**దేవరకొండ, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం ఆయన దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ తో కలిసి భీమనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉంటే తక్షణమే కొనుగోలు చేయాలని, ఎలాంటి ఆలస్యం చేయవద్దని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, విశ్రాంతి సౌకర్యాలు, తేమ పరీక్షలు, గన్ని బ్యాగుల సరఫరా వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. మిల్లర్లతో సమన్వయం చేసుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపంతి నాయక్, డి సి ఓ పత్య నాయక్, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో పార్వతి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,రైతులు ఉన్నారు.

# ప్రయాణ సమయంలో రోడ్డు నియమాలు పాటించాలి

- రహదారి నియమాలు పాటించేలా తల్లిదండ్రులకు లేఖలు రాయాలి
- విద్యార్థులను కోరిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్, ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** ప్రయాణ సమయంలో తల్లితండ్రులు రోడ్డు నియమాలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తల్లితండ్రులకు సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణ, సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం 3వ రోజు సూర్యాపేట పట్టణంలోని సిటీ టాలెంట్ హైస్కూల్ నందు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. రహదారి వినియోగంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి పట్టణ సిఐ వెంకటయ్య, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, రవాణా శాఖ అధికారి జయప్రకాష్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు తెలిపే కరపత్రాలు పోస్టర్లను అందించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని కోరారు.రోడ్లపై ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై నిర్లక్ష్యం జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు.డ్రగ్స్ వినియోగం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా తప్పుడు మార్గాలు సూచించిన తప్పుడు పనులకు ప్రోత్సహించిన వాటిని ఉపాధ్యాయుల దృష్టికి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై తల్లిదండ్రులు అజాగ్రత్తగా ఉండటం వల్ల చాలా మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు.రోడ్డు నియమాల గురించి రోడ్లపై పాటించాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలని హెల్మెట్ వాడకం, సీటు బెల్ట్ ధరించడం గురించి వివరించాలని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదనే విషయం గురించి తల్లిదండ్రులకు లేఖల ద్వారా తెలియజేయాలని సూచించారు.ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరిస్తామని, సీట్ బెల్ట్ పెట్టుకుంటామని, మద్యం తాగి వాహనాలు నడపమని తల్లిదండ్రుల నుండి పిల్లలు ప్రామిస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో కలలు ఆశలు పెట్టుకుంటారని వీటిని నిజం చేయాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని అన్నారు.నిర్లక్ష్యంగా ఉంటే రహదారులపై ప్రమాదాల సంభవించి మృత్యువాత పడతారని గుర్తు చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే టప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు.పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, కార్యక్రమానికి హాజరైన మీడియా ప్రతినిధులకు హెల్మెట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, స్కూల్ కరస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపాల్ మురళీధర్, పోలీస్, ఆర్టీవో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు నివారణ



**దేవరకొండ, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని దేవరకొండ డిఎస్పి ఎం వీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులతో కలిసి పట్టణంలో మీనాక్షి చౌరస్తా మరియు బస్టాండ్ సమీపంలో మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటిస్తామంటూ విద్యార్థులు మరియు, వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో తప్పనిసరిగా సీటబెల్ట్ పెట్టుకోవాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ఈ కార్యక్రమం లో సీఐ వెంకట్ రెడ్డి, కరెస్పాండెంట్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ మహమ్మద్ అన్వర్ హుస్సేన్, విద్యార్థులు,వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



**దేవరకొండ, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** దేవరకొండ లోని ప్రాంతీయ వైద్యశాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఏమైంది? అని అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఎక్స్‌రే విభాగాన్ని సందర్శించి, రోగులు గంటల తరబడి వేచి చూస్తున్నారని తెలుసుకున్న కలెక్టర్, ఆలస్యం ఎందుకు జరుగుతోందని సిబ్బందిని ప్రశ్నించారు. జనరల్ ఓపీ, దంత వైద్య విభాగాలను పరిశీలించి, రోగులకు కూర్చునే సదుపాయాలు కల్పించాలని సూచించారు. రోగులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారికి అవసరమైన వివరాలు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రోజూ ఎన్ని కేసులు వస్తున్నాయో అడిగి తెలుసుకున్న కలెక్టర్, సేవల్లో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆర్డిఓ రమణారెడ్డి ,తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో పార్వతి , ఆస్పత్రి సూపరింటిండెంట్ రవి ప్రకాష్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## మండల స్థాయి సమావేశాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు నిర్వహించే మండల స్థాయి వారికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆర్డిఓలు,తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎపిఓ, ఎపిఎం, ఎంపిఓలతో మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ నేడు మండల స్థాయి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, వాటిలో ప్రస్తుత, రాబోయే ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలపై విస్తృత అవగాహన కల్పించడం,పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం అన్నారు. పారిశుద్ధ్యం పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్,అరైవ్ అలైవ్ థీమాటిక్ వీక్ లో భాగంగా కార్యక్రమంలో సమావేశమైన ప్రజలకు హెల్మెట్లు,సీట్ బెల్టులు ధరించడం, ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించడం, రోడ్డు భద్రతపై పౌరులతో ప్రతిజ్ఞ చేయించటం, మండల పరిధిలో గల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చు పౌరులకు నో హెల్మెట్ నో ఎంట్రీ బోర్డులు విధిగా కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, హౌసింగ్ పిడి సిద్ధార్థ, డీఈఓ అశోక్, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ అధికారులు దయానంద రాణి, నరసింహ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడులో రోడ్డెక్కిన అన్నదాత

- ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం!
- బస్తాకు రెండు కిలోల కోతపై రైతుల ఆగ్రహం..
- సమాధానం చెప్పని అధికారులు!



**గుర్రంపోడు, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు కన్నెర్రజేశారు.ఐకేపీ సెంటర్లు తెరిచినా ఇప్పటివరకు గుర్రంపోడు మండల కేంద్రంలో ఒక్క గింజ కూడా కొనలేదని ఆరోపిస్తూ బుధవారం నల్లగొండ - దేవరకొండ రహదారిపై బైఠాయించారు. ఒకవైపు కొనుగోళ్లలో జాప్యం జరుగుతుంటే,మరోవైపు నిర్వాహకులు బస్తాకు రెండు కిలోల కోత విధిస్తామని చెప్పడంపై రైతులు మండిపడ్డారు.దళారులు,మిల్లర్లు కుమ్మక్కై తమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఓ, ఎంఆర్ఓలను రైతులు నిలదీయగా వారు సమాధానం చెప్పలేక మౌనం వహించారు. తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించి, అక్రమ కోతలను అరికట్టాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.




## ట్రంప్ ప్రకటనతో బుల్ జోరు..

### రూ.10లక్షల కోట్లు పెరిగిన సంపద

దేశీయ మార్కెట్లు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి శాంతి చర్చలు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన మార్కెట్లలో జోష్ నింపింది. దీంతో సూచీలు నేడు భారీగా లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.10 లక్షల కోట్ల మేర పెరిగింది.ఉదయం 77,981 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ (క్రితం ముగింపు 76,847) ఒక దశలో 78,270కి పెరిగింది. చివరకు 1263 పాయింట్ల లాభంతో 78,111 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 388 పాయింట్లు లాభపడి, 24,231 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.37గా ఉంది. నిఫ్టీ సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎటర్నల్, మ్యాక్స్ హెల్త్‌కేర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి.తమ బలగాలు హర్మూజ్‌ను దిగ్బంధించడంతో ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు నిలిచిపోయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే యుద్ధం ముగింపు దశకు చేరుకుందని, ఇరాన్‌తో చర్చలు ఉంటాయని ట్రంప్ ప్రకటించారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ఉన్నాయి. ఇక, చమురు ధరలు కూడా కాస్త దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 95 డాలర్లుగా ఉంది. ఇవన్నీ నేటి ట్రేడింగ్‌లో మదుపర్లకు లాభాలను తెచ్చిపెట్టాయి.

## రూ.22వేల కోట్ల నష్టం..

### టాటావైపు ఎయిరిండియా చూపు..!

దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాకు భారీ నష్టాలు వచ్చినట్లు తెలుస్తోంది. రూ.22వేల కోట్ల నష్టాలను మూటగట్టుకుందని సంబంధిత వర్గాలను పేర్కొంటూ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో వాటాదారుల నుంచి కంపెనీ ఆర్థిక సాయం కోరుతున్నట్లు పేర్కొన్నాయి. ఈ మేరకు టాటాగ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్‌ను సంప్రదించినట్లు సమాచారం.మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరానికి ఈ నష్టాన్ని నివేదించినట్లు తెలుస్తోంది. నష్టం 1.6 బిలియన్ డాలర్లు ఉండొచ్చని వచ్చిన అంతర్గత అంచనాల కంటే ఈ మొత్తం భారీగా ఉండటం గమనార్హం. గతేడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ గగనతలం మూసివేత, ప్రస్తుత పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఈ కంపెనీని ఇబ్బందిపెట్టాయి. కార్యకలాపాలు సజావుగా సాగేందుకు వెంటనే అవసరమైన నిధుల కోసం టాటాగ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో చర్చలు జరుపుతోందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు.




# డిజిటల్ చెల్లింపుల రారాజు.. 'యూపీఐ'

### గత నెలలో లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లకు..

#### అంతర్జాతీయ రియల్-టైమ్ చెల్లింపుల్లో 49% వాటా

రైతుబజారుకు వెళ్లి కూరగాయలు కొన్నా, కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకున్నా.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో చెల్లింపులు చేయడం మనదేశంలో సర్వసాధారణంగా మారింది. చిన్న బడ్డీ కొట్టు నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకు చెల్లింపుల్లో యూపీఐ హవా కొనసాగుతోంది. ప్రజలకు చిల్లర సమస్య తీరిపోయింది. నగదు కోసం ఏటీఎంల వద్ద వరుసల్లో నిలబడటం కనుమరుగైంది. 2016 ఏప్రిల్ 11న యూపీఐ సేవలను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. గత నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లకు చేరింది. గత పదేళ్లలో, ప్రజల రోజువారీ జీవితంలో యూపీఐ చెల్లింపులు ఒక భాగంగా మారడాన్ని ఇది సూచిస్తోంది. డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. వర్చువల్ పేమెంట్ అడ్రస్ (వీపీఏ) ద్వారా బ్యాంక్ ఖాతాలను లింక్ చేయడంతో, లావాదేవీలు చాలా సులభంగా మారాయి. ఎవరికైనా నగదు పంపాలన్నా, వారి బ్యాంక్ ఖాతా సంఖ్య, ఐఎఫ్ఎస్సీ కోడ్ అవసరం లేకుండా పోయింది. ఒక వ్యక్తి మొబైల్ నంబరు/యూపీఐ ఐడీ ఉంటే, సురక్షిత ధ్రువీకరణ (సెక్యూర్ ఆథెంటికేషన్) వినియోగించి నగదు పంపొచ్చు లేదా స్వీకరించొచ్చు. రోజులో ఏ సమయంలో అయినా, రియల్ టైమ్‌లో ఆటంకాలు లేకుండా, నగదు పంపే వెసులుబాటు ఉండటంతో ఎక్కువ మంది యూపీఐ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. నగదుపై ఆధారపడటాన్ని యూపీఐ తగ్గించింది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ వినియోగదార్లు కూడా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి అడుగుపెట్టేందుకు ఇదే కారణం. మన దేశంలో




2021లో 216 బ్యాంకులు యూపీఐ సదుపాయం కల్పిస్తుండగా, 2026 జనవరికి వీటి సంఖ్య 691కి చేరింది.సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భూటాన్, నేపాల్, మారిషస్, శ్రీలంక, ఖతార్, ఇజ్రాయెల్ దేశాల్లోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి.

**రిటెయిల్ డిజిటల్ లావాదేవీల్లో 81%**

లావాదేవీల సంఖ్య, ప్రాసెసింగ్ పరంగా రియల్-టైమ్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే యూపీఐ అగ్ర స్థానంలో ఉంది. మన దేశంలో రిటెయిల్ డిజిటల్ లావాదేవీల్లో యూపీఐ వాటా 81%. అంతర్జాతీయంగా రియల్-టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో 49% వాటా యూపీఐదే. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) కూడా, ప్రపంచ రియల్-టైమ్ చెల్లింపుల వ్యవస్థల్లో పరిమాణ పరంగా యూపీఐ అగ్రస్థానంలో ఉందని గుర్తించింది.

**యూపీఐ లైట్.. ఆటోపే.. క్రెడిట్ ఆన్ యూపీఐ**

చిన్న మొత్తాల చెల్లింపుల కోసం యూపీఐ లైట్ వంటి ఫీచర్లనూ ఆవిష్కరించారు. క్రమం తప్పకుండా చెల్లించాల్సిన లావాదేవీల కోసం యూపీఐ ఆటోపే, ప్రీ-అప్రూవ్డ్ క్రెడిట్ కోసం క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి సదుపాయాలూ ఉన్నాయి. యూపీఐకి బలమైన సెక్యూరిటీ ఆర్కిటెక్చర్ ఉంది. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం కూడా ఉంది. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి 2026 ఏప్రిల్ 1 నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ చెల్లింపుల కోసం 2-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ తప్పనిసరి చేసింది. మోసాలను తగ్గించి, డిజిటల్ లావాదేవీలపై నమ్మకాన్ని పెంపొందించేందుకు పిన్, బయోమెట్రిక్స్, ఓటీపీలతో పాటు సెక్యూర్ టోకెన్స్ వంటి లేయర్లు ఇందులో ఉన్నాయి.

## భారత వృద్ధి 0.8% తగ్గొచ్చు!

### చమురు సగటు ధర 130 డాలర్లయితే

### ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక

దిల్లీ: భారతదేశ పటిష్టమైన స్థూల ఆర్థిక పునాదులు.. దీర్ఘకాలం పాటు కొనసాగే చమురు ధరల షాక్ ప్రభావాన్ని తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, 2026లో బ్యారెల్ ముడి చమురు సగటు ధర 130 డాలర్లుగా ఉంటే ఆర్థిక వృద్ధి 80 బేసిస్ పాయింట్లు (0.8 శాతం) తగ్గే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. ఇదే జరిగితే 2026-27లో కార్పొరేట్ ఆదాయాలు (ఎబిటా) 15-25 శాతం వరకు క్షీణించొచ్చని తెలిపింది. మరోవైపు బ్యాంకింగ్ రంగ ఆస్తుల నాణ్యత బలహీనపడి, మొండి బకాయిలు 3.5 శాతానికి చేరొచ్చని పేర్కొంది. 'పశ్చిమాసియా యుద్ధం వల్ల కలిగే ప్రకంపనల ప్రభావానికి భారత్ అతీతం కాదు. పెరిగిన ఇంధన ధరలు, సరఫరా అంతరాయాల వల్ల కలిగే ఇబ్బందులు నెలల తరబడి కొనసాగొచ్చు. ఇది గృహాలు, కార్పొరేషన్లు, బ్యాంకుల ఆర్థిక కార్యకలాపాలను కుంటుపరుస్తుంద'ని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తన నివేదికలో వివరించింది. అయితే బలమైన కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు, మూలధనం మంచి స్థాయిలో ఉన్న బ్యాంకులు ఈ ప్రభావం నుంచి కొంత బయటపడే అవకాశం ఉందని వెల్లడించింది. సార్వభౌమ రేటింగ్‌పై తక్షణ ప్రభావం ఉండదు: స్ట్రెస్ కేసు కింద 2026లో బ్రెంట్ ముడి చమురు ధరను బ్యారెల్‌కు 130 డాలర్లుగా, 2027లో 100 డాలర్లుగా ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. బేస్ కేసులో ఈ ధరలు వరుసగా 85 డాలర్లు, 70 డాలర్లుగా ఉంటాయని తెలిపింది. ఆర్థిక స్థిరీకరణ ప్రయత్నాలకు తాత్కాలిక ఎదురుదెబ్బలు తగలవచ్చని భావిస్తున్నప్పటికీ, భారతదేశ సార్వభౌమ రేటింగ్‌పై తక్షణ ప్రభావం ఏదీ ఉండదని అంచనా వేస్తోంది. అధిక చమురు ధరలు కరెంట్ ఖాతా లోటును పెంచుతాయని తెలిపింది. బ్యారెల్‌కు 10 డాలర్ల పెరుగుదల ఈ లోటును జీడీపీలో 0.4 శాతం మేర పెంచొచ్చని తెలిపింది. సెంటిమెంటు బలహీనపడటం, పెరుగుతున్న దిగుమతుల బిల్లుల నేపథ్యంలో రూపాయి విలువ కూడా క్షీణించే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదికలో ప్రస్తావించింది.

## రోజంతా వచ్చే భారీ బ్యాటరీ..

### కళ్లకు సౌకర్యవంతమైన బ్లూ లైట్.. వివో ప్రో ఫీచర్లివే!

**న్యూఢిల్లీ:**ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో తన మొబైల్ శ్రేణిలో మరో సరికొత్త స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చింది. గతేడాది విడుదలై మంచి ఆదరణ పొందిన వివో ప్రో సక్సెసర్‌గా వివో ౦5 ప్రోను భారత మార్కెట్‌లోకి బుధవారం విడుదల చేసింది. గత స్మార్ట్‌ఫోన్‌తో పోలిస్తే, డిస్ ప్లే, 9020 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, మిలటరీ గ్రేడ్ సర్టిఫికేషన్, ఫ్రంట్ బ్యాక్ కెమెరాలతో 4౧ రికార్డింగ్ వంటి అదనపు ఫీచర్లను జోడించి ఎతిలనీ ౦5 ఖతీనీను తీసుకొచ్చింది. ఒకసారి ఛార్జ్ చేస్తే రోజంతా బ్యాటరీ వస్తుందని వివో చెబుతోంది. మరి దీని ప్రత్యేకతలు, ధర, ఇతర వివరాలు మీకోసం..

**వివో వీ5 ప్రో ప్రత్యేకతలు**

6.83 అంగుళాల 1.5ఐ అమోలెడ్ డిస్‌ప్లే, ఊఆఖీ 10+ సపోర్ట్.144 రిఫ్రెష్ రేట్, 5,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్.8జీబీ/ 12జీబీ ర్యామ్.128జీబీ/ 256జీబీ స్టోరేజ్. 50ఎంపీ మెయిన్ కెమెరా 2 ఎంపీ డెప్త్ సెన్సార్.ముందువైపు 32ఎంపీ సెల్ఫీ కెమెరా.ఐపీ68+, ఐపీ69+ రేటింగ్.9,020 సిలికాన్ యానోడ్ టెక్నాలజీ బ్యాటరీ.7000 ఎఎ2 వీసీ కూలింగ్ సిస్టమ్.ఇండిపెండెంట్ గేమింగ్ యాంటీనా.90 ఫ్లాష్ వైర్డ్ ఛార్జింగ్.50శాతం ఛార్జింగ్ 37 నిమిషాల్లోనే. ఎస్‌జీఎస్‌లో బ్లూ లైట్ సర్టిఫికేషన్. ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజన్ ఓఎస్

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 4.37 | ₹ 4.32 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,40,100 | ₹1,52,840 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్


₹ 2,65,000

# సముద్రంలో 'గుండు'సూది కోసం అమెరికా వెతుకులాట..

**న్యూఢిల్లీ:**ఒక భారీ జలాంతర్గామి మునిగినా.. విమానం కూలినా విశాల సముద్రంలో దాని కచ్చితమైన జాడను కనుక్కోవడానికి వారాలు పట్టొచ్చు.. ఏళ్లు పట్టొచ్చు. మలేసియా విమానం జాడ ఇప్పటికీ దొరక్కపోవడమే దీనికి ఉదాహరణ. అలాంటిది నీటి కింద అమర్చిన చిన్న సైజు సీమైన్స్ ను వెతకడం అంటే.. సముద్రంలో 'గుండుసూది' కోసం జల్లెడ పట్టినట్లే. ప్రస్తుతం అమెరికా పరిస్థితి ఇదే. 'ఇరాన్ సీమైన్స్'ను ఊడ్చేసి హర్మూజ్ జలసంధిని క్లీన్ చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నా.. అదంత సులువైన విషయం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు మైన్స్ ఎక్కడ పరిచామో తెలియదని ఇరాన్ గందరగోళం సృష్టించి వదిలేసింది. దీంతో ఇప్పుడు వాటిని గుర్తించి తొలగించడం అమెరికాకు కత్తిమీద సాములా మారింది.

మైన్స్ పనిపట్టే డెస్ట్రాయర్లు..

హర్మూజ్ మార్గంలో ఇరాన్ పరిచిన సీమైన్స్‌ను తొలగించేందుకు అమెరికా రెండు గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఇ పీటర్సన్, యూఎస్ఎస్ మైఖేల్ మర్ఫీని రంగంలోకి దింపింది. అయితే, ఇవి నేరుగా మైన్స్ ఉన్న ప్రాంతానికి వెళ్లవు. ఇందుకోసం ఎంకే 18, మాడ్ 2 కింగ్‌ఫిష్ లాంటి మానవరహిత అండర్‌వాటర్ వెహికల్స్‌ను అగ్రరాజ్యం ఉపయోగిస్తోంది. టోర్పిడో ఆకారంలో ఉండే ఈ డ్రోన్లు సముద్ర జలాల్లో వేగంగా కదులుతూ.. హైటెక్ సోనార్ల సాయంతో పేలుడు పదార్థాలను గుర్తిస్తాయి.వీటితో పాటు ఎంహెచ్-60ఎస్ వంటి హెలికాప్టర్లను కూడా అమెరికా హర్మూజ్ వద్ద మోహరించింది. ఇవి గగనతలం నుంచే సముద్రాన్ని స్కాన్ చేస్తాయి. వీటిలోని ఎయిర్‌బ్రోన్ లేజర్ మైన్ డిటెక్షన్ సిస్టమ్.. సముద్ర ఉపరితలంపై తేలే, కొంచెం లోతులో ఉండే మైన్లను వేగంగా గుర్తిస్తుంది. సీమైన్స్ కనబడిన వెంటనే హెలికాప్టర్ లేదా డ్రోన్ సాయంతో వాటిని నౌకాదళం నిర్వీర్యం చేస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఎయిర్‌బ్రోన్ మైన్ న్యూట్రలైజేషన్ సిస్టమ్‌ను అమెరికా ఉపయోగిస్తోంది. ఈ సిస్టమ్‌తో హెలికాప్టర్/డ్రోన్ల నుంచి చిన్నపాటి రోబోటిక్ పరికరాన్ని పంపిస్తారు. అది నేరుగా మైన్ మీదకు వెళ్లి పేల్చేస్తుంది. ఇక, అమెరికా డెస్ట్రాయర్లు కేవలం మైన్లను తొలగించడం మాత్రమే గాక.. సముద్ర ఉపరితలంపై ఎదురయ్యే



ముప్పులను పసిగట్టి.. క్షిపణులతో ఛేదించగలవు.

**మైన్‌స్వీపింగ్ ఈజీ కాదు..**

మైన్లను తొలగించే ప్రక్రియ అంత సులువైందని కాదని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా సీమైన్స్‌లో చాలా రకాలుంటాయి. సముద్ర జలాల్లో నౌకలు కదిలినప్పుడు ఏర్పడే పీడనం, తరంగాల శబ్దం, నౌకల విద్యుత్ శక్తి ఆధారంగా పనిచేసే మైన్స్ ఉంటాయి. వీటిల్లో కొన్నింటిని లేజర్ లేదా రాడార్ల సాయంతోనూ గుర్తించలేమని, ఒకవేళ గుర్తించినా వాటిని పేల్చడం కష్టతరమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందుకు అమెరికా వద్ద ప్రస్తుతమున్న మైన్‌స్వీపింగ్ సామర్థ్యం సరిపోదని అంచనా వేస్తున్నారు.అగ్రరాజ్యం గతేడాది పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న నాలుగు ప్రత్యేక మైన్‌స్వీపర్లను నేవీ విధుల నుంచి పక్కనబెట్టింది. ప్రస్తుతం ఈ బాధ్యతలను లిట్టోరల్ కాంబాట్ షిప్‌లు నిర్వర్తిస్తున్నాయి. అమెరికా వద్ద ఈ రకం నౌకలు మూడు ఉండగా.. అవి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయన్నది రహస్యమే. గత నెల ఇందులో రెండు సింగపూర్ జలాల్లో కన్పించినట్లు వార్తలు వచ్చాయి. అందువల్ల క్లిష్టతరమైన మైన్లను తొలగించేందుకు అమెరికా ఇప్పుడు మిత్ర దేశాలపై ఆధారపడొచ్చనే అంచనాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**ఇరాన్ చుట్టూ 15 యుద్ధ నౌకలు..**

శాంతి చర్చలు విఫలమవడంతో ఇరాన్ ఓడరేవులు, తీర ప్రాంతాలను అమెరికా నౌకాదళం దిగ్బంధించింది. ఈ ప్రక్రియ కోసం ఇరాన్ పోర్టులు, తీరప్రాంతాల చుట్టూ 15కు పైగా యుద్ధనౌకలను అమెరికా మోహరించింది. ఇందులో యూఎస్ఎస్ ట్రిపోలి (ఎల్‌హెచ్‌ఏ 7) కూడా ఉంది. ఈ యుద్ధనౌకపై ఎఫ్-35బి లైటెనింగ్ 2 స్టెల్త్‌ఫైటర్లు, ఎంవీ-22 ఆస్‌ప్రేస్, హెలికాప్టర్లు వంటివి అందుబాటులో ఉంటాయి. ఇవి హర్మూజ్‌లో ఇరాన్ నుంచి ఎదురయ్యే ముప్పును సమర్థంగా అడ్డుకోగలవని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు..

కదిరి(జనంసాక్షి): సత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఓ కూలీ ఇంట్లో నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు పేలి గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై మంత్రి సత్యకుమార్ ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.డిటోనేటర్లు, అమ్మోనియం సల్ఫేట్ వల్లే పేలుడు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. వెంకన్న, సంపత్ కుటుంబం కొండల్లో డిటోనేటర్లు పేల్చి రాళ్లుగా మార్చి విక్రయిస్తోంది. ఇంట్లో డిటోనేటర్లు, అమ్మోనియం సల్ఫేట్, డీజిల్ నిల్వ ఉంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదాన్ని పసిగట్టి వెంకన్న, సంపత్ పిల్లలను తీసుకొని బయటకు పరిగెత్తినట్లు తెలుస్తోంది. డిటోనేటర్లు ఒక్కసారిగా పేలడంతో మంటలు ఆర్పేందుకు వెళ్లిన ఐదుగురు స్థానికులు మృతి చెందారు.

గ్యాస్ పేలుడు ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి

కుమ్మరవాండ్లపల్లిలో గ్యాస్ పేలుడు ఘటనపై ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తు నిర్వహించి పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు మంత్రి సవిత ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన వెనుక ఏవైనా అసాంఘిక శక్తుల ప్రమేయం ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గాయపడిన వారికి ఉత్తమ చికిత్స అందిస్తామని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఆస్తి నష్టంపైనా పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు

## బంగ్లాలో ఘోరం

ఢాకా(జనంసాక్షి):అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

## వికసిత్ కర్ణాటక కోసం పాటుపడండి

వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం. పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం. 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం. జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం. రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం. నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం. ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## భారత్-అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలకు సన్నాహాలు!

ట్రంప్ పలు దేశాలపై విధించిన టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి. తాజాగా వీటిని పునరుద్ధరించేందుకు ఇరుదేశాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జులై ఆరంభం నుంచి టారిఫ్‌లను పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు.

## అప్పుల ఊబిలో పాక్..

# ఆదుకున్న సౌదీ

**న్యూఢిల్లీ:**ఆర్థిక సమస్యలతో సతమతమవుతోన్న పాకిస్థాన్‌కు సౌదీ అరేబియా మరోసారి అండగా నిలిచింది. ముఖ్యంగా విదేశీ మారక నిల్వలు క్షీణిస్తున్న వేళ.. మూడు బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందించేందుకు అంగీకరించింది. వచ్చే వారం రోజుల్లో ఈ నిధులు విడుదలయ్యే అవకాశాలున్నట్లు పాకిస్థాన్ ఆర్థిక శాఖ వెల్లడించింది. అంతేకాదు, ఇదివరకే తీసుకున్న ఐదు బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఏటా పునరుద్ధరించాల్సి ఉన్నప్పటికీ.. ఈ గడువును కూడా సౌదీ అరేబియా మూడేళ్లకు పొడిగించింది.ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న పాకిస్థాన్ అనేక అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో యూఏఈ నుంచి తీసుకున్న రుణంలో దాదాపు 3.5 బిలియన్ డాలర్లు ఈ నెలలో తిరిగి చెల్లించాల్సి ఉంది. దీంతో విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇటువంటి కీలక సమయంలో తమకు ఆర్థిక భరోసా లభించిందని పాకిస్థాన్ మంత్రి ముహమ్మద్ ఔరంగజేబ్ పేర్కొన్నారు. తమ విదేశీ మారక నిల్వలను బలోపేతం చేసుకోవడంలో ఇవి దోహదపడతాయన్నారు. వాషింగ్టన్‌లో జరుగుతున్న ప్రపంచబ్యాంక్-ఐఎంఎఫ్ సమావేశాల్లో భాగంగా సౌదీతో ఈ ఒప్పందం కుదిరిందన్నారు.

## రూ.9.3 కోట్ల విలువైన పికాసో పెయింటింగ్..

### రూ.11 వేలకే సొంతం!

పారిస్: ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుల్లో స్పెయిన్‌కు చెందిన పాబ్లో పికాసో ఒకరు. ఆయన పెయింటింగ్స్‌కు చాలామంది అభిమానులు ఉన్నారు. ఈ క్రమంలోనే పారిస్‌కు చెందిన ఓ వ్యక్తి.. రూ.9.3 కోట్ల విలువైన ఓ పికాసో పెయింటింగ్‌ను కేవలం రూ.11 వేలకే సొంతం చేసుకోవడం గమనార్హం. అల్జీమర్స్‌పై పరిశోధనలకు గానూ నిధుల సేకరణ కోసం పారిస్‌లోని అల్జీమర్స్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వాహకులు.. '1 పికాసో ఫర్ 100 యూరోస్' పేరిట ఈ పెయింటింగ్‌ను అమ్మకానికి తీసుకొచ్చారు. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా మొత్తం 1.20 లక్షల టికెట్లు విక్రయించారు. పారిస్‌లోని క్రిస్టీస్ ఆక్షన్ హౌస్‌లో ఆన్‌లైన్ డ్రా నిర్వహించగా.. ఈ నగరానికే చెందిన సేల్స్ ఇంజినీర్ అరీ హోదారాను అదృష్టం వరించడంతో రూ.11వేలకే ఆ పెయింటింగ్ దక్కింది. ఈ విషయాన్ని తాను తొలుత నమ్మలేకపోయానని ఆయన వెల్లడించారు. 1941లో పికాసో తన దీర్ఘకాల భాగస్వామి డోరా మార్ పెయింటింగ్ వేశారు. టికెట్ల విక్రయాలతో నిర్వాహకులకు 12 మిలియన్ యూరోలు (14 మిలియన్ డాలర్లు) సమకూరాయి. గతంలోనూ రెండుసార్లు పికాసో చిత్రాలు విక్రయించగా.. 10 మిలియన్ యూరోలకు పైగా నిధులు సమకూరాయని నిర్వాహకులు తెలిపారు.

# నారీ శక్తి.. దేశానికే శక్తి

- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఒక చరిత్రాత్మక ఘట్టం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా




**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 15:(జనం సాక్షి) :** నారీ శక్తి...దేశానికే శక్తి అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.బుధవారం నగరంలోని నాందేవ్ వాడ శివాజీ చౌక్ నుంచి ఉమా మహేశ్వరాలయం వరకు నారీ శక్తి వందన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా స్వతంత్రం చేయడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు పెంచడం, మహిళల హక్కులు రక్షించడం.. నారీ శక్తి అభియాన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. మహిళల పాత్ర కుటుంబం నుంచి దేశాభివృద్ధి వరకు కీలకం కానుందన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని, కేవలం ఒక పథకం కాదని, మహిళలను సమాన హక్కులతో సమాజంలో ముందుకు తీసుకెళ్లే మహత్తర ఉద్యమం అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏళ్ళుగా అమలు చేయని మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోదీ చేస్తున్నారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని, ఆ దిశగానే అడుగులు వేస్తున్నారని తెలిపారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకురాలు, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమంలో మహిళలు రాణిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు. క్రీడల్లో అంతరిక్షంలో దేశ స్వతంత్రంలో రాజకీయాల్లో మహిళల పాత్ర పెరుగుతుందని గుర్తు చేశారు. మొదటి సారి 1996లోనే మహిళా బిల్లు ప్రవేశపెట్టారని కానీ మోక్షం కలగలేదన్నారు. ప్రధాని మోదీ వల్ల సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ గొప్ప నిర్ణయం అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, విప్ న్యాలం సునీత, కార్పొరేటర్లు కల్పే అర్చనా, వైష్ణవి, ఇప్పకాయల సుమిత్ర, కాంపల్లి మమత, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.




# సర్వేయర్ చిక్కడు దొరకడు

## కార్యాలయం చుట్టూ తిరిగిన ఫలితం లేకపాయే.?

- రియల్‌స్టేట్‌పై ఉన్న మమకారం.రైతు భూమిపై లేకపాయే!
- సర్వే నోటీసులు కూడ ఇవ్వని వైనం... రైతుకు తప్పని నిరీక్షణ

**ధారూర్ ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** "అన్నదాత సుఖీభవ" అని నినాదాలు చేపడం తప్ప,ఆచరణలో రైతుగోడు వినేవారే కరువయ్యారు. రియల్ ఎస్టేట్.భూములకు వెంచర్లకు,వ్యాపార సంస్థల భూములకు నిమిషాల్లో పనులు చేసిపెట్టే యంత్రాంగం సామాన్య రైతు తన భూమిని కొలవమని అడిగితే మాత్రం నెలల తరబడి తిప్పించుకొంటున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మండల పరిధిలోని నాగ సముందర్ గ్రామానికి చెందిన రైతు భోయిని రాములు తన భూమి సర్వే నంబర్ 233/ఆ/2/1లో 1.34 గుంటల భూమిని సర్వే చేయాలనీ 19/06/2025 నాడు సర్వే కోసం దరఖాస్తు చేసుకుని 'సర్వేయర్' రాక కోసం రైతుకు ఎదురుచూపులే తప్ప ఏమీ లేదని అవేదన వ్యక్తం చేశాడు.భూమి సర్వే కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని అధికారులు సర్వేకు సంబంధించి నోటీసులు ఇప్పటి వరకు జారీ చేయలేదని సమయానికి సర్వేయర్ రాకపోవడంతో రైతు ఇబ్బందులకు గురవుతున్నారు."రియల్ ఎస్టేట్ భూముల దగ్గరకు పరుగు పరుగున వెళ్లే అధికారులు, నా పొలం సర్వే చేసే తీరిక లేదా?"అని బాధితుడు తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

### అధికారి నిర్లక్ష్యం.. రైతుకు శాపం

సకాలంలో సర్వే జరగకపోవడం వల్ల పొరుగు రైతులతో సరిహద్దు వివాదాలు తలెత్తుతున్నాయి. మానసిక ఆందోళన చెందుతున్నానని రైతు వాపోతున్నారు. చలాన్ కట్టి నెలలు గడుస్తున్నా, 'రేపు మాపు' అంటూ కాలయాపన చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### రైతు డిమాండ్

ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న రైతు భూమి సర్వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశారు.

### నేను రైతు పొలం వద్దకు వెళ్లాను : సర్వేయర్

ఇట్టి విషయంలో సర్వేయర్‌ను వివరణ అడగగా సర్వే నిమిత్తం పోలం వద్దకు వెళ్లడం జరిగింది. రైతు పెండ్లికి వెళ్లాను అనడంతో వెన్ను తిరగడం జరిగిందని సర్వేయర్ తెలిపారు.

# వేములవాడలోని ఇసుక రీచ్ ఆకస్మిక తనిఖీ

- అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూలవాగు ఇసుక రీచ్‌ను సీఐ వీరప్రసాద్ తో కలసి బుధవారం డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇసుక తవ్వకాల విధానం,రవాణా అనుమతులు,రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం ద్వారానే ఇసుక సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడం,అనధికార నిల్వలు ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఇసుక రవాణాలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలని ఆయన స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో చిక్కిన అవినీతి చేప

- హుజూరాబాద్ మున్సిపల్ ఈఫీసులో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు
- 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాడెడ్‌గా దొరికిన ఏఈ



**హుజూరాబాద్, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** అవినీతి నిరోధక శాఖ వలలో మరో అవినీతి చేప చిక్కింది. ఓ నిర్మాణ పనులకు సంబంధించి ఫైనల్ బిల్లు క్లియర్ చేసేందుకు రూ. 50వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి. వివరాలిలా ఉన్నాయి...బాధితుడు హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వర్షపునీటి కాలువ పనులను పూర్తి చేశారు. ఈ పనులకు సంబంధించి కొలతల పుస్తకం నమోదు చేయడం, తుది బిల్లు ప్రాసెస్ చేయడం లాంటి పనులు పూర్తి చేయడానికి ఏఈ సుధాకర్ రెడ్డి రూ. 50,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా నిఘా పెట్టారు. హుజూరాబాద్‌లోని ఆర్టీసీ డిపో నిందితుడు ఫిర్యాదుదారుడి నుండి లంచం సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీ బృందం దాడి చేసి పట్టుకుంది. నిందితుడి వద్ద ఉన్న లంచం సొమ్మును రసాయన పరీక్షల అనంతరం స్వాధీనం చేసుకున్నారు. తన విధులను నిజాయితీగా నిర్వర్తించకుండా, అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినందుకు ఆయనపై కేసు నమోదు చేశారు. నిందితుడైన ఏఈని అరెస్ట్ చేసిన అధికారులు, కరీంనగర్‌లోని ఎస్పీఈ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచనున్నారు. ప్రస్తుతం ఈ కేసుపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

# డిహెచ్ పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలను జయప్రదం చేయండి

**వాల్ పోస్టర్స్ విడుదల చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజారత్నం**




**గోదావరిఖని, జనంసాక్షి :** సిపిఐ అనుబంధ ప్రజాసంఘం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండో మహాసభలు ఈ నెల 17, 18 న వరంగల్ లో జరుగుతాయని, ఇట్టి మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం కోరారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ఆయన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ ఈ నెలలో 17, 18 తేదీలలో వరంగల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో మొదటి మహాసభ నుండి రెండో మహాసభ వరకు చేసిన కార్యక్రమాలను చర్చించి, రాబోయే కాలానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాట కార్యక్రమాలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై మైనార్టీల పై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, మహిళల పై అత్యాచారాలు మితిమీరి పోతున్నాయని, దళితులకు రావలసిన ఏ ఒక్క హక్కులు కూడా ఇప్పటివరకు అమలు చేసిన పరిస్థితులు లేవని ఆయన ఆరోపించారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు ఇలా ఎన్నో హామీలతో ప్రభుత్వాలు చేపట్టిన దళితులకు మాత్రం అన్యాయాలే జరిగినాయని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎస్సీలకు సబ్ ప్లాన్లు ఉన్నా , ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు సబ్ ప్లాన్ నుంచి నిధులు విడుదల చేసి దళితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో జరుగుతున్న దళిత వ్యతిరేక విధానాలపై కూడా ఈ యొక్క మహాసభలో చర్చించి పోరాట కార్యక్రమాలు తీసుకోవడానికి నిర్ణయాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రజలందరూ కలిసి రావాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు పడాల కనకరాజు , రొంటాల లింగయ్య, బోశీత రాజు, ఎర్ర గొల్ల చేరాలు, ఆర్ కనకయ్య, గాజుల పునేంద్ర. పుల్లూరి రామచందర్ పాల్గొన్నారు.



# అసైన్మెంట్ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ఫిర్యాదు

**యాచారం ఏప్రిల్ 15 (జనం సాక్షి ):** ఆసైన్మెంట్ భూమిని అక్రమంగా కబ్జా చేసి ఇంటి నెంబరు వేయించుకునేలా సాయపడిన వారిపై చర్యలు తీసుకోవాలని మొండి గౌరెల్లి సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆర్డిఓ అనంతరెడ్డి, తహసిల్దారు అయ్యప్ప, ఎంపీడీవో ఆఫీసులో సూపరింటెండెంట్ శైలజకు వినతి అందజేశారు. గ్రామములో అసైన్మెంట్ సర్వే నెంబర్లు 19, 68, 127 వీటిలో 127 సర్వే నెంబర్లలో మాజి సర్పంచ్ బండిమీది కృష్ణ, మాజీ వార్డు మెంబర్ ఎట్టి లక్ష్మయ్య కొంత మంది భూమిని కబ్జా చేసి గత పంచాయతి కార్యదర్శిని బెదిరించి ఇంటి నెంబర్లు వేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని మోసం చేసి నకిలీ పాస్ బుక్‌లు పొందినవారిని కఠినంగా శిక్షించి వారి పాస్‌బుక్‌లు రద్దు చేయాలనీ కోరారు. అక్రమంగా కబ్జా చేసిన వారిపై అక్రమంగా ఇంటి నంబర్ ఇచ్చిన అధికారల పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి దాదాపు 5 నుండి 15 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డ్ సభ్యులు తాండ్ర రవీందర్, తాండ్ర యాదయ్య, బోరిగ మంగమ్మ యాదయ్య, గోరటి జగదీశ్వర్ వినతి అందజేసిన వారిలో ఉన్నారు.

## ప్రతిభ కనబర్చిన కేజీబీవీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు.ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల కేజీబీవీ బీపీసీలో కీర్తన 436/440, ముస్తాబాద్ కేజీబీవీ ఎంపీసీలో బీ మమత 466/470, రుద్రంగి కేజీబీవీ ఎంపీసీలో జీ మమత 466/470 మార్కులు సాధించారు. తంగళ్లపల్లి కేజీబీవీ ఎంపీ హెచ్ డబ్ల్యూలో ఎల్ శృతికి490 /500, వేములవాడ కేజీబీవీ ఏఐఎంఎల్ లో అక్షిత 486/500, ముస్తాబాద్ కేజీబీవీలో జీ శ్యామల ఎంపీసీలో 984/1000 మార్కులు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం
- కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి



**గోదావరిఖని, జనంసాక్షి :** రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాలు, బొగ్గుగనుల్లో జరిగే ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ మెడికవర్ వైద్యుల సూచించారు. ప్రధానంగా ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్య సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి వ్యక్తిని తరలిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం పదింతలు ఉంటుందని తెలిపారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేశ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. సింగరేణి ఏరియాలో గనుల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ఇలాంటి సందర్భాల్లో వేగవంతమైన వైద్య చికిత్స అత్యంత కీలకమని పేర్కొన్నారు. తలకు తగిలే గాయాలు ప్రమాదాల్లో ప్రధాన కారణమవుతున్నాయని, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సీటీ స్కాన్ వంటి పరీక్షలు చేయగలిగితే అంతర్గత గాయాలను త్వరగా గుర్తించి చికిత్స అందించవచ్చని చెప్పారు. ట్రామా కేర్ విషయంలో తాము అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. పాలీట్రామా అంటే ఒకే రోగికి శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతినే పరిస్థితి. ఇలాంటి కేసుల్లో న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు కలిసి సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని రకాల నిపుణులు అందుబాటులో ఉండే ఆసుపత్రిలోనే క్లిష్ట కేసులకు సమర్థవంతమైన చికిత్స సాధ్యమవుతుందని తెలిపారు. ఇంటి వద్ద జరిగే సాధారణ గాయాల విషయంలో కూడా నిర్లక్ష్యం చేయకూడదని, వీలైనంత త్వరగా వైద్య చికిత్స పొందాలని సూచించారు. ప్రతి గాయం చిన్నదే అనుకుని వదిలేస్తే అది పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రమాద ఘటనల్లో స్పృహలో లేని పరిస్థితుల్లో న్యూరోసర్జన్‌తో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుల పాత్ర కీలకమని, సమగ్రంగా చూసుకోవడంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, రమేశ్ పాల్గొన్నారు.

## నిబంధనలకు అనుగుణంగా
# అర్హులను ఎంపిక చేయాలి

**జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** ప్రభుత్వ పథకాలకు నిబంధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన " డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ" సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీ యాక్షన్ ప్లాన్-2025-26 కి సంబంధించిన అంశాలు, మండలవారీ గా లక్ష్యాలను కమిటీ ముందు ప్రవేశపెట్టి వారి సంయుక్తంగా ఆమోదం పొందటం జరిగింది. అలాగే లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 గైడ్ లైన్స్ ప్రకారంగా "మండలస్థాయి ఎంపిక కమిటీ"ని ఏర్పాటు చేశారు.ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కింద వ్యవసాయ రంగం (సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్), పశు పోషణ రంగం ( 2 మిల్క్ అనిమల్స్), రవాణా రంగం ఈవీ త్రీ వీలర్స్ (గూడ్స్), ఈవీ త్రీ వీలర్స్ (ప్యాసింజర్స్), ఈవీ టు వీలర్స్ పరికరాలు సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల, మండల స్థాయిలో లక్ష్యాల కేటాయింపు అన్నీ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయాలని సూచించారు.ఇట్టి సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జనరల్ మేనేజర్ (జిల్లా పరిశ్రమలు) హనుమంతు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలి

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం కార్పొరేషన్ 60 డివిజన్ల ఇంచార్జిలను పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం ప్రకటించారు.బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.అలాగే రెండవ సారి 56 డివిజన్ ఇంచార్జిగా జిట్టవేన ప్రశాంత్ ముదిరాజ్ కు అవకాశం ఇచ్చారు.ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గం బీసీ సెల్ ముఖ్య అధికార ప్రతినిధి, 56వ ఇంచార్జి జిట్టవేన ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానని వారు అన్నారు.అలాగే జిట్టవేన ప్రశాంత్ ముదిరాజ్ ను రామగుండం కార్పరేషన్ 56వ డివిజన్ ఇంచార్జిగా నియమించినందుకు పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కు సహకరించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు జిట్టవేన ప్రశాంత్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్కులు సాధించిన
# కోట రెజోనెన్స్ విద్యార్థులు

- విద్యార్థుల అభినందన సభలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం - సుడా చైర్మన్ కోమటి రెడ్డి
- కరీంనగర్‌లో కోట రెజోనెన్స్ జూనియర్ కళాశాల బ్రాండ్ ఇమేజ్‌గా మారింది




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని, కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్ లోని రేకుర్తిలో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనె ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు. మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్‌కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి. అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కె.సహనశ్రీ 995, ద్వితీయ సంవత్సరం బైపీసీలో జి.రోషిని 993, బైపిసి ప్రథమ సంవత్సరంలో పి.శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అభినందించి, పూల గుచ్చం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 3245 ఎకరాల నిమ్జ్ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలి

## 45 రోజులలో పూర్తిస్థాయిలో అప్పగిచ్చేలా చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 15 (జనం సాక్షి ):**
జహీరాబాద్ పారిశ్రామిక వాడలోని జాతీయ పెట్టుబడి మరియు తయారీ మండలి (నిమ్జ్) పరిధిలో మొదటి దశలో సేకరించిన 3245 ఎకరాల భూమిని 45 రోజులలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ పొజిషన్‌లోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ భూమిని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెంటనే అప్పగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, నిమ్జ్, టీజీఐఐసీ అధికారులు, ఏఈఓలు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి దశలో 3245 ఎకరాల భూమిని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిమ్జ్ ఫేజ్–1 పరిధిలో మిగిలి ఉన్న ఎల్గోయి, సిద్ధాపూర్, చిలేపల్లి, ముంగి, రుక్మాపూర్, హద్నూర్ గ్రామాల్లోభూములు స్వాధీనపర్చుకోవడానికి సర్వే నిర్వహణ కోసం ప్రత్యేకంగా 6 బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి బృందంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ ఎక్స్టెన్షన్ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, ప్రతిరోజు సమీక్ష ద్వారా పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.
ఫెన్సింగ్ క్లియరెన్స్, రోడ్ల విస్తరణ పనులను సమగ్రంగా చేపట్టాలని,




ప్రస్తుతం సాగులో ఉన్న పంటల కోత సమయాన్ని పరిగణనలోకి తీసుకుని పంటలు పూర్తయ్యిన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా ఫెన్సింగ్ తొలగించే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. అలాగే చెట్లు, పొదలు, రాళ్లు వంటి అవరోధాలను పూర్తిగా తొలగించి, భూమిని సమానంగా లెవెలింగ్ చేసే పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్ల లొకేషన్‌ను వెంటనే ఖరారు చేసి, విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ విట్టల్, జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, జహీరాబాద్ డి ఎస్ పి సైదులు నాయక్ నిమ్జ్ డిప్యూటీ తహసీల్దారు ఆనంద్ కుమార్, వ్యవసాయ శాఖ ఎక్స్టెన్షన్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని బూతు స్థాయి నుంచి బలోపేతం చేయాలి : మధుయాష్కిగౌడ్

**హయత్ నగర్, ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు డివిజన్ అధ్యక్షులు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఎల్బీ నగర్ నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులతో సమావేశాన్ని వనస్థలిపురం లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలలో భాగస్వామ్యం, నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. త్వరలో జరగనున్న ఎస్ఐఆర్ లో ఓటర్ల తొలగింపు, చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కాంగ్రెస్ పార్టీ తరఫున బూత్ ఏజెంట్లు ఇందుకు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, బండా సురేందర్ రెడ్డి, డి.శశిధర్ రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, లింగాల కిషోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మంజుల రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, కొండోజు శ్రీనివాస్, రిజ్వాన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.






# చావనైనా చస్తాం.. భూములైతే వదలం

- ఎన్టీఆర్ చౌరస్తాలో రాపోల్ కార్ల బాద్ రైతుల దీక్ష
- పోలీసులతో వాద్వివాదం ఉద్రుక్త పరిస్థితి
- జాగృతి అధ్యక్షురాలు మాజీ ఎంపీ కవిత అరెస్ట్
- బంటారం పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఎండ దెబ్బకు సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతు ఆస్పత్రికి తరలింపు

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 15 (జనం సాక్షి):**
చావనైనా చస్తాం .. భూమినైయితే వదలమంటూ రైతులు మండేటి ఎండలో దీక్ష నిర్వహించారు. ఎండను లెక్కచేయకుండా సీఎం స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దీక్ష సాగించారు. దీంతో వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో కొన్ని గంటల పాటు ఉద్రుత పరిస్థితి నెలకొంది. రైతుల నినాదాలుతో చౌరస్తా దద్దరిల్లింది. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని రాపోలు గ్రామాని కి చెందిన రైతులు వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎండలో ఒకరోజు దీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పొట్ట కొట్టి కారిడార్ ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తాము కారిడార్ ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములు వదులుకోమని చావానైనా చస్తామని భీష్మించి మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా ఎన్టీఆర్ చౌరస్తాలో దీక్ష కొనసాగించారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రైతుల దీక్ష కొనసాగుతున్నంతసేపు పోలీసులు ట్రాఫిక్ ను దారి మళ్లిచారు. లగచర్ల సంఘటనను దృష్టిలో పెట్టుకొని అధికారులు పోలీసులను భారీగా మోహరించారు. రైతుల దీక్షకు మద్దతుగా జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత దీక్షలో పాల్గొనడంతో పరిస్థితి ఉద్రుతంగా మారింది. రైతుల సమస్యపై జాగృతి అధ్యక్షురాలు వికారాబాద్ జిల్లా కలెక్టర్ తో చరవాణిలో మాట్లాడారు. కారిడార్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని తాను ఏమి చేయలేనని కలెక్టర్ చెప్పినట్లు జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత మీడియాకు తెలియజేశారు. మధ్యాహ్నం నుంచి దీక్ష కొనసాగుతుండడంతో పోలీసులు జాగృతి అధ్యక్షురాలు కవితను అరెస్టు చేసి బంటారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో రైతులకు పోలీసులకు మధ్య వాగ్వివాదంతో పాటు తోపులాట జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్థానిక పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పదవులకు రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఎండలో రైతులు దీక్ష కొన సాగించడంతో మహిళా రైతు పద్మమ్మ ఎండ దెబ్బకు సొమ్మసిల్లి పడిపోయింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కవిత అరెస్టు అనంతరం రైతులను అక్కడి నుంచి తరలించారు. ఎలాంటి సంఘటన జరగకుండా పోలీసులు రైతులను పంపించి వేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల జులుం

## ట్రాక్టర్ పట్టివేత.. ఆరుగురిపై బైండోవర్




**కరీంనగర్ క్రైమ్ ఏప్రిల్ 15 (జనం సాక్షి) :**
జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది మొగ్దుంపూర్ గ్రామ పరిధిలో అనుమానాస్పదంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ట్రాక్టర్‌ను మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన మీసాల రాజు, తన యజమాని వడ్లూరి సంపత్ ఆదేశాల మేరకు నడుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. వెంటనే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని (సీజ్ చేసి), నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారు. ఇక ఇటీవల అక్రమ ఇసుక రవాణాలో పట్టుబడిన వ్యక్తులపై కూడా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముత్యం అజయ్, వెల్ది గ్రామానికి చెందిన నగునూరి అనిల్, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి కుమార్, కొత్తూరి వెంకటేష్, అలాగే మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన మీసాల రాజు, వడ్లూరి సంపత్‌లను కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరు పరచి, ఒక్కొక్కరిపై లక్ష రూపాయల పూచికత్తుతో బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని, అలాగే స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను ఎమ్మార్వో కార్యాలయం ద్వారా వేలం వేయడానికి చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోదీ సంకల్పం

## కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి



**రాజేంద్రనగర్, ఏప్రిల్15(జనం సాక్షి) :** మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోదీ సంకల్పం ఎనలేనిదని బిజెపి రాష్ట్ర నాయకురాలు జనహిత వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ఆమె బీజేపీ శ్రేణుల తో కలిసి చట్టసభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం ద్వారా దేశ అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని, ఇది వికసిత భారత నిర్మాణానికి కీలకంగా మారుతుందని ఆమె అన్నారు. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చారిత్రక చర్చలు జరగనున్నాయని తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ బిల్లుతో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించబడుతుందని, ప్రధానమంత్రి నాయకత్వంలో నారీశక్తికి పెద్దపీట వేస్తూ, మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ బిల్లును ఏకాభిప్రాయంతో ఆమోదించాలన్నదే ప్రధాని సంకల్పమని పేర్కొన్నారు. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వికసిత భారత నిర్మాణానికి మార్గం సుగమమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును నారీ లోకానికి ప్రధాని మోదీ అందిస్తున్న గొప్ప బహుమానంగా ఆమె అభివర్ణించారు.






# అంబేద్కర్ జయంతి రోజు దళిత మహిళపై దాడి

- ఖండించిన జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయ
- కర్కాశంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 14 (జనంసాక్షి):** జిల్లేడు చౌదరి గూడ మండల పరిధిలోని ఎదిర గ్రామంలో దళిత మహిళపై దాస్టికానికి ఒడిగట్టిన ఘటనను జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయ తీవ్రంగా ఖండించారు. ఒక మహిళ అని చూడకుండా కర్కాశంగా వ్యవహరించి కొట్టిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సంఘటన అంబేద్కర్ జయంతి రోజున జరగడం మరింత ఆందోళన కలిగించిందని, అణగారిన వర్గాలపై ఇలాంటి దాడులు సహించలేమని జయ అన్నారు. దళిత మహిళల భద్రత, గౌరవం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ఘటనపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులు కూడా ఈ ఘటనను ఖండిస్తూ, దళిత మహిళల రక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలని కోరుతున్నారు.

# ప్రజలు మారకుంటే రవాణా వ్యవస్థ మారదు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మంత్రికి ఘన స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ, రూరల్ ఎమ్మెల్యే, జిల్లా అధికారులు

**నిజామాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (జనంసాక్షి):**
ఎన్ని చట్టాలు, నిబంధనలు అమలు చేసినా ప్రజలలో మార్పు రానంత వరకు రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నిలువరించడం సాధ్యం కాదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా 'అరైవ్ అలైవ్' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వివరించారు.
హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటలకు నిజామాబాద్ చేరుకున్న మంత్రిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. అక్కడి నుంచి పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ర్యాలీ కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకోగా, అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా అధికారులు, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మానవహారంలో భాగస్వాములయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అతి వేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. దీనిని గుర్తిస్తూ పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం 'అరైవ్ అలైవ్' పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు దోహదపడాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని 'రహా వీర్'గా గుర్తించి రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేయబడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# షార్ట్ సర్క్యూట్‌తో చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధం

**చిగురుమామిడి ఏప్రిల్ 15(జనంసాక్షి):** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధంమైన ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేటలో చోటు చేసుకుంది. ఇక వివరాల్లోకి వెళితే నవాబుపేట గ్రామానికి చెందిన బొల్లి సంపత్ తండ్రి లింగయ్య అనే రైతు వ్యవసాయ భూమి పక్కన ఉన్న వేరొక రైతు వ్యవసాయ భూమిలో నిర్మించిన కోళ్ల ఫారం కోసం బొల్లి సంపత్ వ్యవసాయ భూమిలో నుండి విద్యుత్ సరఫరా కరెంట్ తీగలను ఏర్పాటు చేశారు కానీ అవ్వి నామమాత్రంగానే కర్రల సాయంతో భూమికి దగ్గరగా ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం దాదాపు ఒంటిగంట సమయంలో సంపత్ వ్యవసాయ భూమిలో నుండి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల రాపిడితో నిప్పు రవ్వలు ఏర్పడి మొక్కజొన్న పంటపై పడడంతో పంట కాలిపోయింది. ఇట్టి విషయాన్ని సర్పంచ్ గుళ్ల రజితరాజుకి చెప్పగా ఫైర్ ఇంజన్కి సమాచారం అందించి కలుతాన్న పంటని అర్పడం జరిగింది, అని రైతు సంపత్ చెప్పడం జరిగింది, అలాగే రైతు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే పంట ఎండి కోతకు వచ్చిన దశలో వుండడంతో పూర్తిగా కాలిపోయింది. అయితే గతంలోనే పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులకు కరెంటు తీగల సమస్య చెప్పినప్పటికీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తద్వారా ఇప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరిగి పంట నష్టపోయామని రైతు తల్లిదండ్రులు లింగయ్య-లక్ష్మీ బోరున విలపిస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని గ్రామ జి పీ ఓ శ్రీనివాస్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేతికి వచ్చినపంట కరెంటు ప్రమాదం వలన క బూడిద అవ్వడం పట్ల గ్రామస్తులు రైతుకు అండగా ఉండి ప్రభుత్వం రైతుకు తగు నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.



# మణికొండలో ఎన్సీడీ ఆరోగ్య శిబిరం

**రాజేంద్రనగర్, ఏప్రిల్15(జనంసాక్షి) :** మణికొండలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఎన్సీడీ ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. శిబిరంలో లబ్ధిదా రులకు అవసరమైన టీకా కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్‌హెచ్‌పీ డా. పూజా నాగరి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఏఎన్ఎంలు యాదమ్మ, స్వప్న, ఆశా కార్యకర్తలు దీపా, సులోచన సమన్వయంతో సేవలు అందించారు. శిబిరాన్ని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి, మణికొండ బీజేపీ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి, ఎక్స్ కో-ఆప్షన్ చైర్మన్ సిద్ధప్ప, పదవీ విరమణ ప్రధానోపాధ్యాయులు రఘు, సతీష్ కుమార్ సందర్శించి, ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ శిబిరం ద్వారా ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.



# భూ కబ్జాదారులకు అధికారుల వత్తాసు

## అంజనాద్రి నగర్ ప్లాట్ ఓనర్ల ఆవేదన

**అబ్దుల్లాపూర్ మెట్టు, ఏప్రిల్ 14 (జనం సాక్షి) :**
భూ కబ్జాదారులకు ప్రభుత్వ అధికారులు వత్తాసు పలుకుతున్నారని అంజనాద్రి నగర్ ప్లాట్ల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం కుంట్లూర్ గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ఈ ఆరోపణలు చేశారు. సభ్యుల వివరాల ప్రకారం, కుంట్లూర్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 204, 208లో 1994లో అంజనాద్రి నగర్, పార్థసారథిపురం పేర్లతో లేఅవుట్లు రూపొందించి ప్లాట్లు విక్రయించారు. అప్పటి నుండి ప్లాట్ యజమానులు తమ భూములను స్వాధీనం చేసుకుని వినియోగంలో ఉంచుకుంటూ వచ్చారని తెలిపారు. అయితే ఇటీవల కొంతమంది దెవలపర్లు అక్రమంగా భూమిలోకి ప్రవేశించి, కాంపౌండ్ గోడలను కూల్చివేయడంతో పాటు లేఅవుట్ రోడ్లను ఆక్రమించి ప్లాట్ యజమానులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.200 కోట్లకు పైగా ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చట్టబద్ధ హక్కులు లేకపోయినా, రెవెన్యూ అధికారులు పాసుబుక్స్ జారీ చేయడం, భూమిని నాన్-అగ్రికల్చర్‌గా మార్చడం, అలాగే హెచ్ఎండిఏ ద్వారా లేఅవుట్ అనుమతులు ఇవ్వడం అనుమానాస్పదమని ప్రశ్నించారు. కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారని అధికారులను నిలదీశారు. 1979లో జరిగిన అమ్మకపు ఒప్పందాన్ని ఆధారంగా చూపిస్తూ ప్రత్యర్థులు హక్కులు కలిగి ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, ఆ లావాదేవీ చట్టబద్ధం కాదని, సంబంధిత ఆర్డినెన్సులు మరియు ట్రిబ్యునల్ తీర్పులు తమకే అనుకూలంగా ఉన్నాయని వివరించారు. 2009లో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన రద్దు ఉత్తర్వులను కూడా గుర్తు చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయగా హైడ్రా జోక్యం చేసుకుని, కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అక్రమంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే సుమారు 120 మంది ప్లాట్ యజమానులు ఈ వివాదంతో నష్టపోతున్నార ని, తమ పిల్లల భవిష్యత్ కోసం కొనుగోలు చేసిన ప్లాట్లపై ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంట్లూర్ గ్రామంలో లేని భూమిపై లేఅవుట్ చేసి అమాయక ప్లాట్ ఓనర్లను మోసం చేస్తున్నారని, ఒకవైపు రెవెన్యూ అధికారులు పాసుబుక్స్ ఇస్తే, మరోవైపు హెచ్ఎండిఏ అధికారులు లేఅవుట్ అనుమతులు ఇవ్వడం ద్వారా మరింత అన్యాయం జరుగుతోందని ప్లాట్ ఓనర్లు ఆరోపిస్తున్నారు. కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత

- పేదల ప్రాణాలతో ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు
- ఆరోగ్య రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రను తక్షణమే ఆపాలి
- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలి
- ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి




**కాప్రా ఏప్రిల్ 15 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో తీవ్రమైన మందుల కొరత ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠి లోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంచాలకులు బి. రవీంద్ర నాయక్ కు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఆధారపడే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తూ, కార్పొరేట్ ఆసుపత్రులకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.
జ్వరం, షుగర్, బీపీ వంటి సాధారణ వ్యాధులకు అవసరమైన ప్రాథమిక మందులు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడం అత్యంత దారుణమన్నారు. అత్యవసర మందుల లేమితో పేషంట్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతపై హై లెవల్ జ్యుడీషియల్ విచారణ జరపాలని,
అన్ని ప్రాథమిక మరియు ప్రాణరక్షక మందులను తక్షణమే ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని, మందుల కొనుగోలు, సరఫరాలో జరిగిన అవినీతిపై బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు లాభం చేకూర్చే విధానాలను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి ఉచిత, నాణ్యమైన వైద్యం హక్కుగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్ పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

## అనుమానాలతో గందరగోళం సృష్టించవద్దు

**రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు**



**హైదరాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** మహిళా రిజర్వేషన్లు, నియోజక వర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

# మీ సేవా కేంద్రాల్లో అవినీతి

- **సర్వీస్ కోసం వచ్చే వారి నుంచి వసూళ్లు**
- **ఫిర్యాదులు రావడంతో ఏసీబీ సోదాలు**



**హైదరాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్ పేట్, అల్వాల్‌లో మీసేవ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌర సేవ పత్రాల జారీలో దళారుల ద్వారా మీసేవ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బుధవారం ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజలను ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీ సేవల్లో దోపిడి ఎక్కువైపోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చార్జీల పేరుతో మీసేవ సిబ్బంది చేస్తోన్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం వెళ్తే దోచుకుంటున్నారు. టెక్నాలజీతో పౌర సేవలను మరింత సులభతరం చేస్తున్నామంటూ అన్ని సేవలను మీ సేవ కేంద్రాలకు అప్పగించి అధికారులు మాత్రం చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువీకరణ, ఓబీసీ తదితర సర్టిఫికెట్ల కోసం రూ. 45 చెల్లిస్తే చాలు. కానీ, ఈ ఫీజు ఎక్కడా తీసుకోవడం లేదు. దాదాపు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అప్లై చేసేప్పుడు కాకుండా తిరిగి సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే టైంలో అదనంగా కలెక్ట్ చేస్తున్నారని దరఖాస్తుదారులు చెప్తున్నారు. క్యాస్ట్, లోకల్, ఇన్కమ్ సర్టిఫికెట్లు కావాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ కోసం అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇది హైదరాబాద్ జిల్లా మినహా మిగతా జిల్లాల్లో తప్పనిసరి అనే రూలేవు. హైదరాబాద్ జిల్లాలో కూడా ఇదివరకు క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకొని ఉంటే ఆ సర్టిఫికెట్ ఆధారంగా మళ్లీ అప్లై చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. కానీ, మీ సేవలో మాత్రం అదేమీ కుదరదని, అఫిడవిట్ కచ్చితంగా కావాల్సిందేనని వందల్లో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా సర్వీసులకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల స్పష్టమైన సమాచారంతో చార్ట్ ఏర్పాటు చేయడంలేదు. ఒకవేళ చార్ట్ పెట్టినా ఆ ధరలు కనిపించకుండా చిన్న అక్షరాలతో మొక్కబడిగా ఏర్పాటు చేస్తున్నారు.మీసేవ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని మీ సేవకు సంబంధించిన ఉన్నతాధికారులు చెప్తున్నారు. సెంటర్లలో ఖచ్చితంగా సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, అందులో చెప్పిన ధరలనే తీసుకోవాలంటున్నారు. ఎక్కడైనా ఎక్కువ డబ్బులు తీసుకున్నట్టు దృష్టికి వస్తే డయల్ 1100 లేదా 18004251110 నంబర్కు కాల్ చేసి సమాచారం ఇస్తే యాక్షన్ తీసుకుంటామంటున్నారు అధికారులు.

# వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స

## ప్రతి హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఒక బృందం

- **ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **వేసవి నేపథ్యంలో హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు**
- **అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల ఏర్పాటు**
- **అన్ని వార్డులు, వెయిటింగ్ ఏరియాలో మంచినీటి సౌకర్యం**
- **అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లలో తాగు నీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు, వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి బుధవారం సమీక్ష చేశారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎండా కాలం నేపథ్యంలో వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలను, హాస్పిటళ్లలో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. వడ దెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, అవసరమైన మెడిసిన్, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, వారి అటెండెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. పెద్ద హాస్పిటల్స్‌లో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్ ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతున్నదని, ఈ నేపథ్యంలో అవుట్ పేషెంట్లకు, ఇన్‌పేషెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసీయూలు, అవసరమైన ఇతర వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు రిపేర్ ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలన్నారు.

### అవగాహనతోనే నివారణ సాధ్యం

వడ దెబ్బ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హాస్పిటల్స్, బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన కంటెంట్‌ను రూపొందించి, ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి సంవత్సరం ఉపాధి హామి కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. పట్టణాల్లో ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, ఇతర గిగ్ వర్కర్లకు వడ దెబ్బపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

### ఎమర్జెన్సీలో డెడికేటెడ్ టీమ్ ఉండాలి

వడ దెబ్బతో అనారోగ్యం పాలైన వారికి చికిత్స అందించేందుకు ఒక బృందాన్ని హాస్పిటల్ ఎమర్జెన్సీ ఏరియాలో సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. పేషెంట్ వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించేలా ఈ బృందంలోని సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన మెడిసిన్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

### జనరేటర్లు సిద్ధంగా ఉండాలి

వేసవి కాలంలో గాలిదుమారాలు, ఈదురు గాలులు, అకాల వర్షాల వలన విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంటుందని, ఇలాంటి సమయాల్లో పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా వెంటనే జనరేటర్లు ఆన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు అన్ని హాస్పిటల్స్‌లో జనరేటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అయితే, వెంటనే వాటి పనితీరును పరిశీలించాలని, అవసరమైన చోట రిపేర్లు, మెయింటనన్స్ చేయించాలని మంత్రి ఆదేశించారు.

### అగ్ని ప్రమాదాల ముప్పు

వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుందని అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. అన్ని హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఈ నేపథ్యంలో అన్ని హాస్పిటల్స్‌లో పవర్ కేబుల్స్‌ను వెంటనే చెక్ చేయించాలని మంత్రి ఆదేశించారు.

# రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు?

- **యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే**
- **డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం**
- **మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు**
- **రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్15 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త కోణం

- **కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు ఆర్థిక బంధం**

**హైదరాబాద్, ఏప్రిల్15 (జనంసాక్షి) :** మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, ఈ కేసులో కేదార్ అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మరణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రరోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, కేదార్‌కు మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ముఖ్యంగా రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతా నుంచి కేదార్‌కు రూ.25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ ఆర్థిక లావాదేవీల గురించి రోహిత్ రెడ్డి, రితేష్‌ని ప్రశ్నించగా ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, వారు విచారణకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని విషయాలు రాబట్టడానికి కస్టడీని పొడిగించాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ నివేదికలో స్పష్టం చేశారు.

# అమరావతి పేరుపై స్పష్టత

**అమరావతి, ఏప్రిల్15 (జనంసాక్షి) :** ఏపీ రాజధాని అమరావతి పేరుపై స్పష్టత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక నుంచి అన్ని అధికారిక నోట్‌లు అమరావతి ఇంగ్లీషులో చివరన టిఐ పేరుతోనే ఉండాలని స్పష్టం చేశారు. కొందరు టిఐ బదులు టిహెచ్ఐ అని రాయడాన్ని తప్పుబట్టారు. అమరావతిని ఇంగ్లీష్‌లో రాసేటప్పుడు చివరిలో టిహెచ్ఐ కి బదులుగా టిఐ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు, అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్

**అమరావతి, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన లోకేశ్‌కు పలువురు మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నారాయణ అభినందనలు తెలియజేశారు. తండ్రికి తగ్గ తనయుడు అంటూ కొనియాడారు. ఒకవైపు పార్టీని మరోవైపు తన శాఖను ఎంతో బాధ్యతగా నిర్వర్తిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రిగా తన శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి దేశంలోనే మొదటి స్థానంలో నిలబడేందుకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయని తెలిపారు. రాష్ట్ర యువతకు ఉద్యోగాల కల్పనకు దేశ విదేశాల నుంచి పెట్టుబడులను తీసుకువచ్చేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ నాయకత్వం, ఆలోచనలతో తెలుగుదేశం పార్టీకి మరింత శక్తి వస్తుందనడంలో సందేహం లేదని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# ప్రకృతి పట్ల చెన్నవాసయ్యకున్న మమకారానికి ప్రదర్శన ప్రతీక

## రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా

- **సాలార్‌జంగ్ మ్యూజియంలో 'వర్ణ మైత్రి' చిత్ర ప్రదర్శన ప్రారంభం**
- **సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ లోగో, పోస్టర్‌లను ఆవిష్కరించిన గవర్నర్**





**హైదరాబాద్, ఏప్రిల్ 15 (జనంసాక్షి) :** ప్రకృతి పట్ల రుమలే చెన్నవాసయ్యకున్న మమకారానికి ఈ ప్రదర్శనలో ఉంచిన అద్భుతమైన జలవర్ణ చిత్రాలే ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో కేంద్ర సాంస్కృతిక శాఖ, సాలార్‌జంగ్ మ్యూజియం, బెంగళూరు రుమలే ఆర్ట్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వర్ణ మైత్రి: రుమలే చెన్నవాసయ్య చిత్రాల పునఃసమీక్ష' ప్రదర్శనను గవర్నర్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ప్రదర్శనలోని చిత్రాలను తిలకించిన అనంతరం, అవి అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ, హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన సాలార్‌జంగ్ మ్యూజియం కళా సంపదను సంరక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. హైదరాబాద్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా చార్మినార్‌తో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం కూడా గుర్తుకువస్తుందని తెలిపారు. అమూల్యమైన కళా సంపదను అంకితభావంతో పరిరక్షిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు అధ్యక్షుడిగా ఇది తన తొలి పర్యటన కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రపంచీకరణ యుగంలో మన మూలాలతో అనుసంధానం కల్పించడంలో మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని గవర్నర్ స్పష్టం చేశారు. విభిన్న సంస్కృతులు, భాషలు, మతాల సంగమంగా హైదరాబాద్ నిలిచిందని, భిన్నత్వంలో ఏకత్వమే మన నిజమైన బలమని ఈ నగరం బోధిస్తోందన్నారు. కళ హృదయాలను స్పృశించి భావోద్వేగాలకు జీవం పోసే శక్తి కలిగి ఉందని చెప్పారు. రుమలే చెన్నవాసయ్య విశిష్టమైన శైలి, నైపుణ్యంతో ప్రజల హృదయాలను గెలుచుకున్న గొప్ప కళాకారుడని గవర్నర్ కొనియాడారు. ప్రకృతి పట్ల ఆయనకున్న ప్రగాఢమైన ప్రేమ, ఆధ్యాత్మికతల సమన్వయాన్ని ఆయన చిత్రాలు ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కూడా చురుకుగా పాల్గొని, కళ ద్వారా దేశభక్తికి స్ఫూర్తినిచ్చారని తెలిపారు. నేటి యువత ఆయన జీవితం, కళాకృతుల నుంచి ప్రేరణ పొందాలని ఆకాంక్షించారు. సాలార్‌జంగ్ మ్యూజియం 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమని గవర్నర్ అన్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయక ప్రదర్శనలు, విద్యా కార్యక్రమాలు మునుముందు కొనసాగాలని ఆకాంక్షించారు. దేశ, విదేశాల కళా సంస్థలతో భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాలు ఈ రంగాన్ని మరింత సుసంపన్నం చేస్తాయని, అన్ని ప్రయత్నాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ లోగో, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి సభ్యురాలు సురభి వాణి దేవి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్, రుమలే ఆర్ట్ హౌస్ క్యూరేటర్ కె.ఎస్. శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370